శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము ౨౬. { ఈశ్వరనామసంవత్సరము. చైత్రవైశాఖమాసములు. } సంచిక ౧.



కాకినాడ:

కొత్తపల్లి సూర్యరావుచే బేమచ్ఛార్యాలయమునఁ

ప్రకటింపఁబడినది.

చందా, పోస్టువ్యయములతో సంవత్సరమునకు రు 3-౦-౦.

విడిసంచిక రు ౦-౮-౦.

ఏప్రియల్, మే. 1937.

విషయసూచిక.

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రిక.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

కాకినాడ

ఈశ్వరనామసంవత్సరము

సంపుటము ౨౬.

1937—38.

ఈశ్వర నామ సంవత్సరము

విషయసూచిక.

౨౬ సంపుటము.

శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండునెలలకొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨౬. { ఈశ్వరనామసంవత్సరము. చైత్రవైశాఖమాసములు. } సంచిక ౧.

విజ్ఞాపనము.

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రికకు- ఇరువదియైదేండ్లు గడచినవి. ఇరువదియాఱవసంవత్సరములో నిది మొదటిసంచిక: పెద్దలగు భాషాభిమానుల యాదరమున నిట్లింతవఱకు జరుగుచున్నది. వార్షికమూల్యములనీయవలసినవారికి ముందు జ్ఞాపికలు వ్రాయుచున్నారము. దయచేసి వారువారీయవలసిన ధనమును బంపఁగోరుచున్నారము. మఱియు నూతనసంవత్సరమునకుఁ బంపవలసినధనమును బంపఁగోరుచున్నారము. మరలఁ గాగితములకుఁ గఱవువచ్చుచున్నది. పత్రిక నడచుటకు ముందుగానే యేర్పాటులు చేసికొనక తత్తత్కాలములలోఁ జేసికొనుట కొంత తొందరకుఁ గారణము. కావున మాకుఁ బాఠకులు ముందుగానే తోడ్పడుదురుగాక. పాఠకులు స్వహస్తపరహస్తములచే సాయము గావింపవలయును. పరిషత్ప్రకటితగ్రంథములను గొనియుఁ బత్రికకుఁ బాఠకులయ్యి వారివారిమిత్రులు మాకుఁ బ్రోత్సాహమొసంగ మఱిమఱి కోరుచున్నారము. ఉభయభాషావేత్తలు మాపత్రికకుఁ దగిన భాషావిషయకములు చారిత్రకములు నగు వ్యాసములను రచియించి పంపవేఁడుచున్నారము.

పరిషత్పత్రికలు ప్రాఁతవి కావలసినవారికి వెల సులభముగా నొసంగెదము. వెనుకటిసంచికలు తగ్గిపోవుచున్నవి. విద్యార్థులు, పఠనమందిరములవారు, భాషాభిమానులు వానిని సంగ్రహించి యుంచుకొని వానిలోఁగల యమూల్యవిషయవ్యాసములను గుర్తింతురుగాక యని మనవి.

సత్యనారాయణా!

—శతావధాని- పిసుపాటి చిదంబరశాస్త్రిగారు, పిఠాపురము.—

మ. తొలఁగం ద్రోయుటకున్ విపత్తులు సంతోషంబు నెప్పట్ల వ
ర్ధిలఁగాఁ జేయుటకుం ద్వదన్యుఁ డెవఁడున్ దేవుండు నీవంటి వాఁ
డిలలో లేఁ డని లోక మంతయును నిన్నే కొల్చుచుండంగ న
న్యుల నే నేటికి నాశ్రయింతు శ్రితబంధూ సత్యనారాయణా!

మ. కలలో నీ వొకనాఁడు గన్పడినచోఁ గల్యాణముల్ పెక్కుఁ జా
యలఁ బ్రాప్తించుచునుండ నిన్నెపుడుఁ బ్రత్యక్షంబుగాఁ గన్గొనం
గలుగం గల్గెడిభాగ్య మింత యని వక్కాణింపఁగా నెంతవా
రలకున్ శక్యమె సర్వనిర్వహణధుర్యా సత్యనారాయణా!

మ తపముం జేయఁగఁజాల క్షేత్రములు సందర్శింపఁగాఁజాలఁ బా
పపరీహార మొనర్చుకర్మములు సల్పంజాల నే నెట్లు నీ
కృపకుం బాత్రుఁడనై తరింతు భవవార్ధిన్ నీఁదు నావాఁ డట
న్నపితృప్రేమము నాపయిం గలుగకున్నన్ సత్యనారాయణా!

మ. కలిలోనన్ గలవార లుద్ధృతులు గాఁగన్ రెండుమార్గంబు లిం
దులసంసారవిరక్తుఁడై జగములందున్ నిండు నిన్నాత్మగాఁ
దలఁపం గల్గుటరొండె బద్ధుఁడయినం ద్వద్భక్తిసామ్రాజ్యముం
గలకాలంబు వహించుటొండె భృతలోకా సత్యనారాయణా!

మ. నను నే స్తోత్రముచేసికొంటయును నన్యస్తోత్రముల్ చేసి య
న్యునిచే స్తోత్రము లందికొంటయును నెంచున్ నాకుఁ బ్రాపింపకుం
డను నీపైఁ గలభక్తియుం దొలఁగకుండంగం బ్రసాదింపు మె
ల్లను నే నైహికమైన తుచ్ఛసుఖమెల్లన్ సత్యనారాయణా!

మాచల్దేవీశాసనము.

—పెండ్యాల వేంకటసుబ్రహ్మణ్యశాస్త్రిగారు. పిఠాపురము.—

"శ్లో॥ శ్రీశాకే రసబాణ రామశశి యు జ్యానందసంవత్సరే।
శ్యేష్ఠే.(కృష్ణ)మృగాంక వారసహితే (దశే౯) ఖరాంశేగ్రహే।
సద్భార్యా పరదేశ మాచరమణీ రమ్యం శిలామందిరం।
ప్రాదా చ్ఛ్రీ గుడిమెట్టనామనగరే శ్రీకేశవస్వామినే॥
సప్తాంభోనిధిసంతతాంబుపటలీసంసక్త(ధీరా)చితః
......త్పరదేశమాచరమణీ రత్నేన యత్నాత్కృతే
భూయిష్ఠం గుడిమెట్టనామనగరే విద్యోతమానం నవం
నూనం ప్రాప్య శిలాగృహం విజయతే లక్ష్మీసఖః కేశవః॥
పరదేశే మాచమాంబా పుణ్యప్రారబ్ధసత్తకం
రాజపాళేతాండిచెర్లాగ్రహారద్విజరాజేభ్యోమహిత(ది)రమదాత్॥
రమ్యాయాః పరదేశి మాచయువతే ర్బ్రహ్మప్రతిష్ఠాప్రపా
వాపీకూప తటాక సత్ర సుకృతోద్యానంచ విభ్రాజితం।
స్వామి శ్రీగుడిమెట్ట కేశవ...............తటే
సించంతు ప్రతివాసరం ఘనకృపాసారై ర్మనోహారిభిః॥
శ్రీగుడిమెట్ట చెన్నకేని దేవర మారసాని దేవరముందర పరమనీచ
సానుడదో—"

ఈశాసనము కర్నూలుజిల్లా సోమిదేవిపల్లె స్టేషనునకు నాలుగు మైళ్లు దక్షిణ భాగమం దున్న గుడిమెట్ట యను గ్రామమునందు శిథిలమైన చెన్నకేశవస్వామివారి యాలయమునం దున్నది.

నేను 1921 సంవత్సరమునందు శ్రీపిఠాపురము మహారాజావారి యాజ్ఞానుసారము ప్రాచీనగ్రంథసంపాదనము నిమిత్తము, ఆగ్రామమునకు వెళ్లినప్పు డీశాసనమును జూడ దటస్థించినది. గవర్నమెంటువారు

కర్నూలుమండలము నందలి ప్రాచీనశాసన పరిశోధనము 1920 వ సంవత్సర ప్రాంతమునకుఁ గాని ప్రారంభించినట్లు కనఁబడదు.

ఈశాసనము మాచల్దేవి యను నొకవారవనితచేత నిలకొలుపఁబడినది. ఈపెచే నాకాలముననే నిర్మింపఁబడిన పెద్దచెఱువు గూడ నాగ్రామమునందే ప్రసిద్ధికెక్కి యున్నది. మాచల్దేవి యనునామె రెండవప్రతాపరుద్రచక్రవర్తి యుంపుడుకత్తె యని క్రీడాభిరామమున నిట్లుగా వర్ణింపఁబడినది.

"శా. ద్వీపాంతంబుననుండి వచ్చితివె భూదేవా ప్రశాంతం మహా
పాపం సర్వజగత్ప్రసిద్ధపుమనోబాణాసనామ్నాయ వి
ద్యోపాధ్యాయి ప్రతాపరుద్రధరణీశోపాత్తగోష్ఠీప్రతి
ష్ఠాపారీణ నెఱుంగవయ్యెదవె మాచల్దేవి వారాంగనన్.

వ. చిత్రశాలాప్రవేశంబు చేయుచున్నది. మీరును.........జూడవచ్చునది యనిన.

గీ. లెస్సగాక కిరాట యీ లేమచరిత
మాడుదురు నాటకంబుగ నవనిలోన
దీనిఁ జూడంగఁబోదమా యీనెపమున
సరసిమాతము మనకేమి యచట ననుచు.

వ. అనుచు...బల్లికూటంబున నిలువునం గై సేసి హంసతూలికాతల్పంబు మీఁదం గూర్చున్న హావభావవిభ్రమవిలాసనిధి మాచల్దేవిం గనుంగొని.

* * * * * *

గీ. కల్లఁ జెప్పము విను నీకుఁ గలప్రసిద్ధి
డిల్లి సురతాణికిని లేదు పల్లవోష్ఠి
యాదిలక్ష్మికి నీకును భేదమేమి
యుదధి జనియింపకుండుట యొకటిదక్క.

గీ. ఓరుగంటి మాచాంబ పయోరుహాక్షి
పంచబాణావతారుని మంచిఁ జూచి

కంకణాలంక్రియారుణాబ్జార మెసఁగ
నయ్యగారికి జోహారు లనుచు మ్రొక్కె."

మఱియు చిత్రశాలవర్ణనమును బట్టి మాచ నామె మహాధనికురా లనియు దానశీల యనియుఁ జెప్పవలసి యున్నది.

ఈమెశాసనములు పెక్కు లుండిన వని క్రీడాభిరామపీఠికలో బ్రః వేటూరి ప్రభాకరశాస్త్రిగారు వ్రాసియున్నారు, కాని, శ్రీశాస్త్రిగారి యభిప్రాయము ననుసరించియు నీశాసనమునందలి శకవర్షముల ననుసరించియు మాచల్దేవి ప్రతాపరుద్రునినాఁటిది కాక యాప్రతాపరుద్రుని యనంతరము నూఱేండ్లనాఁటి దయి క్రీ. 1434 సంవత్సర ప్రాంతపుదిగాఁ గనఁబడుచున్నది. ఒకవేళ నీమాచల్దేవి పేరుగలది ప్రతాపరుద్రుని యుంపుడుకత్తెగా నుండిన నుండవచ్చును. ఈమె శ్రీనాథుని కాలపు దనుట మాత్రము నిశ్చయము.

ఈమెభర్తనుగుఱించి-యీశాసనమున "సవాభర్యా" యనియును, "పరదేశమాచరమణి" యనియు నుదాహరింపబడి యుండుటచే నామె గృహనామము పరదేశి యనియు, సత్పురుషులను జేపట్టునదియే యనియుఁ దోఁచుచున్నది. మఱియు శాసనమునకుగున "మాసానిదేవర ముందర పరమనీచసానుండకో'' యను నొకవాక్యమున్నది. దీనిని బట్టి యీమె వారవనిత యనియు స్వవృత్తిని నీచవృత్తినిగానే భావించుచున్న దనియుఁ దలంపఁబడుచున్నది. వృత్తి యెట్టిదైనను- బ్రహ్మప్రతిష్ఠ ప్రపా వాపీ కూప తటాక సత్త్రప్రతిష్ఠాది సుకృతకార్యములనుజేయు సద్వృత్తి గలది యని తలంపవచ్చును.

శ్రీ కృష్ణభూపతిదేవుమహారాజులుంగారివర్ణన.

— శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారు. —

సీసమాలిక.

సిరిమించు మత్స్యభూవరునియన్వయమునఁ
గలశాబ్ధిని ద పాకరుదికరణి
మంజుకళాగరిమంబున జనియించి
మాకువు లనఁ బ్రోల మహితలీలఁ
బ్రాజ్యసామ్రాజ్యధురంధరుఁడై జగ
న్నాథభూపతిదేవునందనుఁ డయి
పొలుపార శ్రీకృష్ణభూపతిదేవు సం
తత దానతోషితధరణిదేవుఁ
డఖిలమూర్ధాభిషిక్తాస్థానమండప
మాధురీధుర్యవాఙ్మహితలలిత
సంస్కృతప్రాకృతసంగీతవైకృత
సాహితీకవితారచన(సు)చణ
కల్పితాత్యనవద్యగద్యపద్యపద్రప
బాధగీతవ్రాతబహుళవర్ణ
వర్ణ్యమానానూన పరగుణజాలుఁడు
నేముదమొక్కోర్ణరసాప్రపూర్ణ
శీలుఁడు తేజోపి శేమసముత్సారి
తా శేమరిపుఁ డస్త్రకౌశలపరి
హసితకృపుఁడు హరిదంతరవలమాన
శారదనీరదపారదహార
హరనీహారసురాహరతారకా
కాశనీకాశప్రకాశమాన
యశుఁ డని తను నహర్నిశ మెల్లమానిసుల్
గొనియాడ బయలువ్రాఁకనలరుకున
దగు జళువాపైఁడితమ్మిమొగ్గలతేవఁ
బయిపయిఁబొల్చు పొంబనఁటుల ...

సొంపును దెసవవు సొరిది నాడాడనేఁ
గెడు మొయిలందూలనడఁచు పసిఁడి
జండాలపెంపును జెలువగు నిలువగు
నలువగు బటువులైనాలచాలు
గని తమ్మునొక్కటఁ గలయు గాటపుటాస
సందటికి. దగి నందమైన
చలువల వేల్పురూపుల కోపు లని మొదం
దలఁచి వలచి తమిఁ దారు తార
కాని కాయంబు నాఁగ్రాలు రసపుబుడ్లు
బారులు భూస్థితి బంచజనుల
పాపము లెడలించి పాలింప నవతరిం
చిన నిలింపులు నాఁగఁ జెలఁగు చిత్ర
పుకరంబుల (వగు) తవురులు బంగారుక
శీదాపనిహారంగు చెంగలించు
గజలక్ష్మ లలరు శీన్ ఖాబుకల్వడములు
నకరఁజిగొలుసుల నంటి వ్రేలు
గ్లోబులు లస్టర్లుఁ గొమరారు నార్గను
లాఁపులు, వాల్ సేట్లు నింపుఁ బెంపు
గాంచనడోలికల్ కౌచీలు, కుర్చీలు
నవరఫీల్ జవ్వాజి యగరు పునుఁగు
తాషుదస్తులు మహాతాబు పోషకులు బ
నారసు వల్వలు నాణెమైన
యాణి కట్టాణి సుప్పాణి ముత్తియముల
హారము ల్పచ్చల పేరులు మగ
ఆలన క్ష్మేషు తురాయీల రతనంబు
టొంటులు కెంపుల యుంగ్రములును
నింపిన మంజసల్ నిల్వుటద్దములను
గొనబు హాంబని పలంగులును గల్గు
కలువరాయని మానికమ్ముల మేడలో

బంగరుతళ్కుపై రంగుమీఱు
నాసీనుఁడై ప్రక్రియార్థికాంశములనై
పుణికిమించు వైయాకరణులు యుక్తి
శాలులౌ తార్కికుల్ జైమినిసూత్రప
విత్రపద్ధతి సక్త విశదమతులు
విమల వేదాంతకోవిదులు వేదవిదులు
హాయిగాఁ బాడుగాయకులుఁ గంపి
తారోహణావరోహాందోళమూర్ఛితా
ప్రత్యాహతాహతప్రముఖదశవి
ధగమకవిజ్ఞాన దక్షులౌ వైణికుల్
మహాహితాగ్నికాశ్రితమంత్రవేద
లు రసజ్ఞులగుకవీశ్వరులు నొక్కొకవేళ
వచియించు కలుకులవలన డెంద
మానంద మొంద నొకప్పు డౌతే యన
మానసలాస్యకళావిలాస...
సరసలైనట్టి యచ్చరల మచ్చరికించు
జట్టీమాటల కట్టుపులయుఁ
బాటల నాటల పరిపాటియింపౌన
రింపఁగా బట్టుల గుంపొకరొడఁ
గై వారములు సేయఁగా వారివారికిఁ
దగు తెఱంగుల మంచిధరణులు రత
నాలుఁ దోడాలు దుశాలాల్ బనారసు
దుస్తులు మొదలగు వస్త్రుల వ
రాలు వజ్రాలసరాలు బిలాతిగు
ఱ్ఱాలు జాల్వాపల్లకీ లొసఁగుచు
నింద్రవైభవభోగనిస్తంద్రుఁ డగుచు
ననయముఁ బ్రజాళి ననురక్తి మనుచుచు వసు
ధాతలం బేలుఁగాత నిరీతిరీతి
నంచు మముఁ బల్కఁగల్గి పల్కించునెపుడు.

ప్రకాశవర్షుఁడు-రసార్ణవాలంకారము.

శ్రీయుతులు వేంకటవీరరాఘవాచార్యులుగారు, యం. ఏ.,
ఆంధ్రగీర్వాణభాషోపన్యాసకులు,
పిఠాపురరాజకళాశాల, కాకినాడ.

— 1. మున్నుడి. —

రెండుసంవత్సరములక్రిందట నాంధ్రసాహిత్యపరిషత్పత్త్రికలో [సంపు. 23-24. (1934-35.)] ప్రకాశవర్షుని 'రసార్ణవాలంకారము' నాసంపాదకత్వమున వెలువడినది. నేఁటివఱకు దానికిఁ టీక వ్రాసి పుస్తకరూపమున నీకృతిపుష్పమును సహృదయలోకమున కర్పించుటకు యోగములు కూడినవి కావు. పలువురు రసజ్ఞు లీగ్రంథము బాపుఁ డని పరిషదధికారులకుఁ జాలసారులు వ్రాయుచుండి రని విని దీనియెడఁ బాఠకలోకము చూపుసమాదరణమునకు సంతసించి, గ్రంథకర్తను, దత్కృతికాలాదులను, నీకృతివైశిష్ట్యమును గుఱించినసమాలోచనమును బండితలోకమున కర్పించుచున్నాఁడను.

— 2. కృతజ్ఞత. —

ఈకృతిని మొట్టమొదట-మహామహోపాధ్యాయ-విద్యాభూషణబిరుదాంకితులు చెన్నపురవిశ్వవిద్యాలయసంస్కృతపండితులునగు వి. వేంకటరామశర్మగారాంగ్లలిపిలో నుచ్చారణచిహ్నముల (Dia-critical marks) తోడను నుపోద్ఘాతముతోడను కలకత్తానగరమున ఆచార్య నరేంద్రనాథ లా[1] సంపాదకత్వమున వెలువడు 'భారతీయేతిహాసత్రైమాసికపత్త్రిక[2]లో నేఁటి కెనిమిదివత్సరములకుఁ బూర్వము [మార్చి-1929 లో] ప్రకటించియున్నారు. ఈకృతి గుణోత్తరముగా నుండుట గాంచి యాంగ్లలిపిలో ముద్రింపఁబడినశ్లోకముల నాంగ్లభాషాభిజ్ఞులే యెంతయో పరిశ్రమ నల్పినఁగాని చదువనేర రవ్వుడు టీక నాంగ్లభాషా

---

1. Dr. Narendranath Law, M. A., B. L., PH. D., P. R. S.
2. 'Indian Historical Quarterly'—Vol. V. No. 1. March, 1929.

గంథము నెఱుఁగని యాంధ్రదేశసంస్కృతపండితుల కీకృతి యున నచుం బితప్రక్రియగా నుండు నని యెంచి దీనిని దెలుఁగు లిపిలో విపులసమాలోచనపూర్వకముగా రసజ్ఞలోకమునకు నివేదించుచున్నాఁడను. శర్మగారీకృతిని బ్రచురించినకొన్ని నెలలకే-ఆచార్య-సుశీలకుమార-డే-గారు[1] [ఢక్కావిశ్వవిద్యాలయమున గీర్వాణపీఠాధ్యక్షులు] శర్మగారిపీఠికలోని యనేకసిద్ధాంతముల ఖండించుచుఁ బైకలకత్తాపత్త్రిక[2]లోనే యొకవ్యాసమును బ్రకటించియున్నారు. 'డే'పండితు లిప్పటికి రెండుసంవత్సరముల కుఁ బూర్వమే 'లండన్' నగరమునుండి వెలువడు 'ప్రాచ్యవిద్యాలయ పత్త్రిక[3]లోఁ బ్రకృతగ్రంథమును గూర్చి యించుక వ్రాసియున్నారు. ఈనడుమ చెన్నపురవిశ్వవిద్యాలయమున గీర్వాణశాఖలోఁ బరిశోధకులుగానుండిన ఆచార్య వి. రాఘవన్ పండితులు కూడ శర్మగారిసిద్ధాంతములను నిరసించుచు చెన్నపురిలోఁ బ్రకటింపఁబడు 'ప్రాచ్యపరిశోధన పత్త్రిక'[4]లో[1934]నొకవ్యాసమును బ్రచురించియున్నారు. సాహిత్యాచార్య, వేదాంతభూషణ నందకిశోరశర్మ యనుకాశీపండితులు ప్రాచ్యవిద్యావైభవ-మహామహోపాధ్యాయ, గోపీనాథకవిరాజ [యం.ఏ] మహోదయుని సంపాదకత్వమున 'సారస్వతాలోకము'నందలి ప్రథమ కిరణమున కనుబంధముగా 'సంస్కృతకవిపరిచయము-భారవి'[5] యను కృతిని [1932] బ్రకటించియున్నారు. పైవ్యాసములు, కృతులును బ్ర

1. Dr. S. K. De, M. A., D. Lit., Head of the Department of Samskrit & Bengali, Dacca University.

2. 'Indian Historical Quarterly'-Vol. V. No. 4. December, 1929. (Pp. 770—80).

3. 'Bulletin of the School of Oriental Studies'-Vol. IV. Part ii, P. 283.

4. 'Journal of Oriental Research'—Vol. VIII. Part 3. Pp. 267—76 (1934).

5. 'The Sarasvataloka'-Kirana I (Supplement)। 'సంస్కృతకవిపరిచయః-మహాకవిర్భారవిః'-నిబన్ధకః సాహిత్యాచార్య శ్రీనందకిశోరశర్మా. [Benares, 1932.]

కృతము విశేషముగా నుపకరించినవి. మఱియు 'డే' పండితుని 'అలంకారశాస్త్రచరిత్ర'[1], పాండురంగవామనకాణేపండితుని 'అలంకారశాస్త్రచరిత్ర'[2], ప్రకృతము ముద్రణమునందున్న డాక్టర్-మాడభూషి కృష్ణమాచార్యులవారి 'సంస్కృతసారస్వతచరిత్రము'[3] నాకుపకారకములయినవి. పాఠకులకు సుబోధముగా నుండుటకై శ్లోకముల ప్రక్క నాయాశ్లోకములందలి విషయములఁ దెలుపుసూచికలను జేర్చియున్నాఁడను. విజయనగరమహారాజసంస్కృతకళాశాలలోని 'రసార్ణవాలంకారము'యొక్క వ్రాఁతప్రతియందలి పాఠభేదము లనుబంధమునఁ జూపఁబడినవి.

— 3. ప్రకాశవర్షులు. —

సంస్కృతవాఙ్మయమునఁ బ్రకాశవర్షుఁ డను నామముతో నలుగురు గ్రంథకర్తలు కన్పట్టుచున్నారు.

౧. వల్లభదేవుని 'సుభాషితావళి'[4]లోను, శార్ఙ్గధరుని 'శార్ఙ్గధరపద్ధతి'[5]లోను నుదాహరింపఁబడిన ప్రకాశవర్షుఁడు. ఈతఁడు కాశ్మీరదేశస్థుఁ డనియు, భట్టహర్షుని సుతుఁ డనియు, 'సుభాషితావళి'లో నుదాహరింపఁబడిన దర్శనీయకవి (=దోర్లతికాదర్శనీయకవి?)కి జనకుఁ డనియు, గౌడకవి భట్టనరసింహకవిపుత్త్రునికి శిష్యుఁ డనియు నందకిశోరపండితులు వ్రాసియున్నారు.[6]; వల్లభదేవ [క్రీ. 1417-67] శార్ఙ్గధరులచే

1. 'Studies in the History of Sanskrit Poetics'- Vol. I (1923)- By Dr. S. K. De, M. A., D. Lit.

2. 'History of Alamkara Literature'-By Prof. P. V. Kane, M. A., LL. M. (1923.)

3. 'History of Classical Sanskrit Literature'- Second, revised and enlarged edition (now in course of publication)- By Dr. M. Krishnamachariar, M. A., M. L., PH. D., M. R. A. S.

4. Edited in the 'Bombay Sanskrit & Prakrit Series'- By Prof. Dr. P. Peterson. (1886).

5. Edited in the 'Bombay Sanskrit & Prakrit Series'- By Dr. Peterson. (1888).

6. సంస్కృతకవిపరిచయము-పు. 30.

[క్రీ. 1363] నుదాహరింపఁబడియుండుటచే నీప్రకాశవర్షుఁడు క్రీ. 1363 కంటెఁ బూర్వుఁ డని చెప్పఁదగును.

౨. భారవికృత 'కిరాతార్జునీయము' నకు వ్యాఖ్యాత.

ఈప్రకాశవర్షుని, తద్వ్యాఖ్యను దేవరాజయజ్వ తనభారవివ్యాఖ్య ('సుబోధిని') యందును,[1] గదసింహుఁడును[2] [క్రీ. 1200-1600] మల్లినాథుఁడును దమ 'కిరాతార్జునీయవ్యాఖ్యల'లో [IV స. 10 శ్లో.] ను బేర్కొనియున్నారు.

3. మాఘకృత 'శిశుపాలవధ'కు వ్యాఖ్యాత.

ఈప్రకాశవర్షుని వల్లభదేవుఁడు స్వకృతమాఘవ్యాఖ్యలోఁ దనకు గురువుగాఁ బేర్కొనియున్నాఁడు. ప్రకాశవర్షునకు మహోపాధ్యాయబిరుద మున్నటు లీతనివ్యాకరమువలనఁ దెలియుచున్నది.[3] ఈగురుశిష్యులు సమకాలికులు గావున వల్లభదేవుని కాలము నిట విచారింపఁజనును. [ఈతఁడు 'సుభాషితావళి'సంధాత యగువల్లభదేవునికంటెఁ బ్రాచీనుఁడు, భిన్నుఁడు నని యెఱుఁగునది.]

---

1. 'ప్రకాశవర్షప్రభృతిప్రణీతా, వ్యాఖ్యా న పూర్ణా ఇతి భారవీయే
కావ్యే ప్రభూతాం విదధాతి టీకాం, శ్రీదేవరాజో విదుషాం నిదేశాత్.'
   - i. 'Triennial Catalogue of MSS.' of the Govt. Oriental Manuscripts Library-(Madras)-Vol. II. Part 1. C. (No. 1854 d)
   - ii. 'Ibid—Vol. IV.' Part 1. (No 2912)
   - iii. 'Travancore Catalogue'-P. 97. [Cantos I-IX & XV]. 1895.

2. 'సన్తి ప్రకాశవర్షాది టీకా అపి సువిస్తరాః
తథాపి లఘుబోధార్థం గదసింహో౽కరోదిమామ్'
'సంస్కృత కవిపరిచయము-భారవి'-పు. 47

3. (అ) 'శ్రుత్వా ప్రకాశవర్షాత్తు వ్యాఖ్యాతం తావ దీదృశమ్
విశేషతస్తు నైవాస్తి బోధో౽త్రానథవా ద్రుతే.'—చతుర్థసర్గటీకా.
(ఆ.) "అత్ర మహోపాధ్యాయః ప్రకాశవర్షః—
'షష్ఠీసమాసో౽ప్యత్ర బహువ్రీహ్యర్థే౽స్త్యేవ త్యేవ. యోహి యస్య
సఖా తస్యాసావపి భవత్యేవ.' ఏవ మత్రాపి. —20 సర్గే 71 శ్లోకటీకా.

వల్లభదేవుని పౌత్త్రుఁడగు కైయటుఁడు క్రీ. శ. 977 లో నానందవర్ధనుని 'దేవీశతకము'నకు వ్యాఖ్యను రచించెను. ఆవ్యాఖ్యనుండి యీ ప్రమాణమును జూచునది.[1]

శ్లో. 'వల్లభదేవాయనిత శ్చన్ద్రాదిత్యా దవాప్య జన్మేమామ్
కైయటనామాఽరచయ ద్వృత్తిం దేవీశతకస్తోత్రే.

శ్లో. వసుమునిగగనోదధి [4078] సమకాలే యాతే కలే స్తథా లోకే
ద్వాపఞ్చాశే వర్షే రచితేయం భీమగుప్తనృపే'.

కైయటుఁడు క్రీ. శ. 977 ప్రాంతముల జీవించియుండుటచే నాతనిపితామహుఁ డగు వల్లభదేవుఁడు క్రీ. శ. 927 ప్రాంతముల జీవించియుండె నని నిశ్చయింపనగును. కావున వల్లభదేవుని విద్యాగురు వగు ప్రకాశవర్షుఁడు క్రీ. శ. 875-925 నడుమ విలసిల్లియుండవచ్చు నని నందకిశోరశర్మగారు వ్రాసియున్నారు.

౪. రసార్ణవాలంకారకర్త యగు ప్రకాశవర్షుఁడు.

ఈనలుగురును భిన్నులా, కారా యనునది విమర్శనీయము. మాఘభారవుల కావ్యములకు వ్యాఖ్య వ్రాసి, సుభాషితావళి మొదలగు సంధానగ్రంథములలోఁ జేర్పఁబడిన ప్రకాశవర్షుఁడు కవి యనియు, సంకువలన నాలంకారికుఁ డగు మనగ్రంథకర్తకంటె భిన్నుఁ డనియు వేంకటరామశర్మగారు వ్రాసియున్నారు.[2] భిన్నవాదమున కితకంటెఁ బ్రబలప్రమాణము నేమియుఁ జూపక సిద్ధాంతీకరించుట చింత్యమనుచు వీరియభిప్రాయమును ఖండించుచు పండితనందకిశోరశర్మగా రిట్లు నుడివియున్నారు;[3]

—కవి యగువాఁ డాలంకారికుఁడు కాఁ డనుట యపసిద్ధాంతము. కవి యైనవాఁడే యాలంకారికుఁ డగుటకు నిదర్శనము లనేకములు గలవు. దండి, భోజుఁడు, 'సాహిత్యదర్పణ' నిర్మాత యగువిశ్వనాథుఁడు 'రసగంగాధర' కారుఁ డగు జగన్నాథపండితరా

1. 'సంస్కృతకవిపరిచయము-భారవి'—పుట. 21.
2. Introduction to 'Rasarnavalankara'—P. IV.
3. 'సంస్కృతకవిపరిచయము'—22-23 పు.

యులు మొదలగు ననేక ఉత్తమాలంకారికులే కాక తమ కావ్యనిర్మాణపాటవముచేతను ప్రసిద్ధులైయున్నారు. నామైక్యముండి, విరోధిప్రమాణము లేనప్పుడు వ్యక్తిద్వయకల్పన మసంగతము. కావునఁ బైనలువురు నొక్కఁడే—

కాని వీరిసిద్ధాంతముకంటె వేంకటరామశర్మగారి యభిప్రాయమే సరి యని తోఁచెడిని. మాఘభారవికావ్యవ్యాఖ్యాత లిరువురు నొక్కఁడే యనియు, నీతఁడు భోజునికంటెఁ [క్రీ. 1005-1054] ప్రాక్తనుఁ డనియు, భోజునికంటె మనయాలంకారికుఁడు భిన్నుఁ డనియు, బరుఁ డనియుఁ దోఁచుచున్నది. సుభాషితావళిలోఁ జేర్పఁబడిన ప్రకాశవర్షుఁడు పైవ్యాఖ్యాతయే కావచ్చును, లేక ప్రకృతగ్రంథకర్త యైనను గావచ్చును. వ్యాఖ్యాత యగుప్రకాశవర్షుని, యాలంకారికుఁ డగుప్రకాశవర్షునిపౌర్వాపర్యవిచారము క్రింది కాలనిర్ణయప్రకరణమునఁ గననగును.

— 4. ప్రకాశవర్షునికాలము. —

భామహుని 'కావ్యాలంకారము'నను, దండి 'కావ్యాదర్శము'నను ప్రకాశవర్షుని 'రసార్ణవాలంకారము'నుండి పదవాక్యవాక్యార్థము లనేకములు హరింపఁబడిన వనియు, ప్రకాశవర్షునికృతి దండిభామహుల కృతుల కుపజీవ్య మనియు నందువలన వీ రిరువురును ప్రకాశవర్షునికంటె నవీను లనియు, భట్టబాణుని జేర్కొనుటచేఁ బ్రకాశవర్షుఁడు బాణుని కంటె నర్వాచీనుఁ డనియు నందుచే మనకవి బాణుని తరువాతను దండిభామహులకుఁ బూర్వమునను [అనఁగా-క్రీ. శ. 650-750 నడుమ] జీవించియుండవలె ననియు వేంకటరామశర్మగారి సిద్ధాంతము.[1] కాని యిది యవిమర్శపూర్వకము. సుశీలకుమారడే, రాఘవన్ పండితులవ్యాసములను బట్టి ప్రకాశవర్షుఁడు భోజునికంటె నవీనుఁ డనియు, భోజుని 'సరస్వతీకంఠాభరణము', 'శృంగారప్రకాశము'ను ప్రకాశవర్షుని కృతులకుపన్నము లనియు సుశీలకుమారడే, రాఘవన్ పండితు లనేకరచనాసామ్యప్రదర్శనపూర్వకముగా నిర్ధారణ చేసియున్నారు. వీరిమతమును బట్టి దండి-భామహ-బాణులకంటె ప్రకాశవర్షుఁడు నవీనుఁ డని వేఱె

1. Introduction to 'Rasarnava'—P. X.

చెప్పనవసరము లేదు. ఒక్క రచనాసామ్యము కాలనిర్ణయవిచారమునఁ బరమప్రమాణము కాఁజాలదు. వీరిసిద్ధాంతము సరియే కాని వీరు చూపిన ప్రమాణములు ప్రబలములు గావు. ప్రకాశవర్షుఁడు భోజునికిఁ బరుఁడనుటకు నొండు రెం డాంతరప్రమాణములు లభించుచున్నవి. వీని నేలకో పైపండితు లలక్ష్యము చేసిరి. ఇవి చింత్యము. 'సరస్వతీకంఠాభరణము' న భోజుఁడు పదదోషప్రకరణమున-'అసాధు'వను దోషము నిట్లు వివరించెను.

“శ్లో. ‘శబ్దశాస్త్రవిరుద్ధం య త్త దసాధు ప్రచక్షతే
యథా-
‘శ్లో. భూరిభారభరాక్రాన్త బాధతి స్కన్ధ ఏష తే
తథా న బాధతే స్కన్ధో యథా బాధతి బాధతే.’

అత్ర బాధతే రాత్మనేపదిత్వాద్ ‘బాధతే’ ఇతి స్యాత్, న పునర్ ‘బాధతి’ ఇతి.” [I గుణవివేచనపరిచ్ఛేదము; 4 పుట. నిర్ణయసాగర ముద్రణము. 1934.] దీనికి రత్నేశ్వరుఁ డిట్లు వ్యాఖ్య వ్రాసియున్నాఁడు:
“అత్ర కేచి దాహుః-‘బాధతిధాతుం సంస్కారప్రచ్యావనేన బాధతే ఇతి బాధతిబాధ స్తస్య సంబోధనం బాధతిబాధేతి. తే-తవ. వచన మితి శేషః.’ఇతి. త దసత్. నేయార్థత్వప్రసఙ్గాత్. అన్యేతు ‘బాధతి ర్బాధతే యథా’ ఇతి పఠన్తి. ఇదం తత్త్వమ్. విద్యమాన స్యార్థవత్త్వ స్యావివక్షాయాం గవిత్యయమాహేత్యాదావివ ప్రాతిపదికసంజ్ఞా న ప్రవర్తతే.”

‘భూరిభార’ అను పైశ్లోకమును శబ్దశాస్త్రవిరుద్ధ మగునసాధుదోషమున కుదాహరణముగా భోజుఁడు చూపియుండ నందలి యుత్తరార్ధమును స్వీకరించి ప్రకాశవర్షుఁడు భోజుఁడు దోష మనిన దాని కపవాదము నిట్టులు నిపుణముగాఁ జూపియున్నాఁడు: [శబ్ద మసాధు వైనను ననుకరణమున గుణీభావము నందును.]

శ్లో. ‘పదం యాతి గుణీభావ మనుకర్తు రసా ధ్వపి
యథా న బాధతే స్కన్ధో యథా బాధతి బాధతే.’

౨ పరి. 36-37 శ్లో. [7 పు.]

భోజుఁడే ప్రకాశవర్షునికృతినుండి శ్లోకార్ధమును గ్రహించె నేమో యని శర్మగా రనవచ్చును. కాని యది సరి కా దని యీ క్రిందిప్రమాణమును బట్టి తెలియనగును. ఈశ్లోకమును దానికి సంబంధించిన వైతిహ్యమును 'శార్ఙ్గధరపద్ధతి' యందు లభించుచున్నవి.[1]

ఒకనాఁడు వేఁటనుండి మరలుచు భోజుఁడు తనపల్లకిని మోయుచు వాహకులలోఁ గ్రొత్తవానిం గని- యాతఁడు మాఱువేషమున నున్న పండితుఁ డని యెఱుఁగక—'ఎక్కుడు బరువుచే నీభుజము బాధనొందుచున్నదా?' యని పృచ్ఛించె నఁట. దానికి బహుశాస్త్రవిశారదుఁడును, విశేషించి, శబ్దశాస్త్రనిష్ణాతుఁడు నగుభోజుఁడు 'బాధతే' యనుటకు 'బాధతి' యని యపప్రయోగము చేసినందులకుఁ జింతించి రా జని యైనను జంకక యాపండితవాహకుఁడు వెంటనే "నీవుచేసిన 'బాధతి' యను నపప్రయోగము కలిగించినంతబాధ నాభుజము కలిగించుటలేదు" అనె నఁట! రసికుఁ డగుభోజుఁ డందులకు మిక్కిలి యానందము నంది యాతని సన్మానించియుండెను.

తనకాలమున కప్పుడే ప్రచురప్రచారము నందిన ధ్వనిసిద్ధాంతమును భోజుఁ డెఱుఁగును. ధ్వన్యాలోకమునుండి కొన్ని కారికల నీతఁడు గ్రహించియు నీతఁడు ధ్వనిమతము నలక్ష్యముచేసి 'ధ్వనిమత్తాతు గాంభీర్యమ్' [I పరి. 73 శ్లో. 74 పు.] అని ధ్వనిని శబ్దగుణ మగు గాంభీర్యముగాఁ జేర్కొనెను. ప్రకాశవర్షుఁడుకూడ [౨ పరి. 20 శ్లో. 6 పు.] ధ్వనిని గాంభీర్య మనుశబ్దగుణముగా నుడివియుండెను. దీనినిబట్టి ధ్వన్యాలోకకారునికంటె [క్రీ. శ. 840-860.] నీతఁడు నవీనుఁ డని తెలియుచున్నది.

'సరస్వతీకంఠాభరణము' మొదలగుకొన్ని సాహిత్యగ్రంథములలో నౌచిత్యము పేర్కొనఁబడినను 'ఔచిత్యవిచారచర్చ' లో నౌచిత్యసిద్ధాంతమును శాస్త్రదృష్టిని విచారించి, కావ్యమున కాత్మ యౌచిత్యమని నిర్ధారణచేసిన మహనీయుఁడు క్షేమేంద్రుఁడు. ఈసిద్ధాంతమును

---

1. 'భూరిభారభరాక్రాన్త బాధతి స్కన్ధ ఏష తే
న తథా బాధతే స్కన్ధో యథా బాధతి బాధతే.

పూర్వార్ధం మృగయాయా గృహమాగచ్ఛతః శిబికారూఢస్య భోజరాజస్యోక్తిః ఉత్తరార్ధం చ రాజదర్శనార్థం ఛద్మశిబికావాహపండితస్య ప్రత్యుక్తిః'

[శా. ప. 562 శ్లో.]

ప్రకాశవర్షుఁడు గుర్తించియే యుండును; కాని 'అగ్నిపురాణము'నందు ఔచిత్య ముభయాలంకారములలోఁ జేర్పఁబడినట్లు లీతఁ డౌచిత్యమును శబ్దాలంకారములలోఁ జేర్చియుండెను. క్షేమేంద్రునికంటె [క్రీ 1025-75.] ప్రకాశవర్షుఁ డర్వాచీనుఁడు కావచ్చును.

భోజునికంటె మనకవి నవీనుఁ డనుటకుఁ బైప్రమాణములకంటె బలవత్తర మైనగ్రంథస్థప్రమాణము లభించుచున్నది. కాని 'రసార్ణవము' పై విమర్శల వెలయించిన 'డే', రాఘవన్ మొదలగు పండితు లెవ్వరు నేకారణముననో దీనిని గుర్తింపరైరి:

ఆఢ్యరాజు, సాహసాంకుఁడు నను ప్రాకృతసంస్కృతభాషాపోష కులగు ప్రభుపుంగవులు, (మహా) భామహుఁడు, బాణుఁడు, వాత్స్యాయనుఁడు నను గ్రంథకర్తలు, మహేశ్వరుఁడు, స్వాయంభువు, వాతవ్యాధి, బృహస్పతి, కౌటిల్యులచేరచింపఁబడిన 'అర్థశాస్త్రములు', కామందకీయ 'నీతిసారము,' 'విదగ్ధముఖమండనము'[1] మొదలగు గ్రంథములును 'రసార్ణవము'నఁ బేర్కొనఁబడెను. ఈకృతు లన్నిటిలో 'విదగ్ధముఖమండనము' నవీనము. ఇది కవిశిక్షాగ్రంథము. దీనికర్త ధర్మదాససూరి యను బౌద్ధసన్న్యాసి. క్రీ. శ. 1293-1309 నడుమనుండిన జినప్రభుఁడు (జయసింహుని శిష్యుఁడు) దీనికి వ్యాఖ్య రచియించెను. అందువలన ధర్మదాససూరి క్రీ. శ. 1190-1210 ప్రాంతముల జీవించి యుండె నని నిర్ణయింపఁజనును.[2] కావున నీతనిగ్రంథమును బేర్కొనిన ప్రకాశవర్షుఁడు క్రీ. శ. 1210 ప్రాంతములకంటె నర్వాచీనుఁ డనిమాత్రము నిర్ణయింపవచ్చును.

5. గ్రంథపరిమాణము.

మనకు లభించినగ్రంథమున 4 పరిచ్ఛేదములు సమగ్రముగను, రసవిచారకము ను ముఖ్యము నగు 5 వపరిచ్ఛేద మసమగ్రముగ ను గలవు. ఈగ్రంథము పంచపరిచ్ఛేదాత్మక మనియే వేంకటరామశర్మగారు

1. 'రసార్ణవము'—3 పరి. 56 శ్లో.
2. S. K. De: 'Sanskrit Poetics'—Vol. I. P. 297.
Dr. M. Krishnamachariar: 'History of Classical Sanskrit Literature.'—P. 766.

ను, 'జే' పండితులును నుడివియున్నవారు. కాని దీనిని సాలంకషముగ గవేషణమొనర్చిన రాఘవన్ పండితులిది యీయాఱుప్రకరణముల గ్రంథమై యుండవలె ననియు, నుభయాలంకారవిచారక మగు పంచమప్రకరణము పూర్తిగాను, రసప్రకరణమగు నాటకప్రకరణము[ముద్రితపుస్తకమున 5 వ పరిచ్ఛేదము.] చాలవఱకును లోపించియుండవలె ననియు నిర్ణయించియున్నారు. అందులకు వారు చూపిన యుపపత్తుల[1] నిటఁ జూపుచున్నాను-

౧. పరిచ్ఛేదము దోషప్రకరణము. ౨. పరి. గుణప్రకరణము. 3-౪. పరి. శబ్దార్థాలంకారప్రకరణములు. ౫. పరి. శృంగారవ్యక్తియనఁబడు రసప్రకరణము. ఇందు 2 పుటలగ్రంథము మాత్రము లభించినది. మనకు లభించినస్వల్పగ్రంథమునుబట్టి చూచినను శృంగారప్రకాశమున భోజుఁడు విపులముగాఁజేసిన రసవిచారమును బ్రకాశవర్షుఁ డీప్రకరణమున సంగ్రహముగా నుడివి యుండె నని తోఁచకమానదు. అందువలన నీపరిచ్ఛేదము తక్కినవానికంటె మిగుల విపులముగా నుండితీరవలెను.

తృతీయపరిచ్ఛేదము మొదట నలంకారములు— బాహ్యములు, ఆభ్యంతరములు, బాహ్యాభ్యంతరములు నని మూఁడువిధము లని మన కవి పేర్కొనియున్నాఁడు. ఈయలంకారవిభజనము నీతఁడు భోజునినుండియే గ్రహించియున్నాఁడు. భోజుఁ డీమూఁడువిధము లగు నలంకారములను ద్రివిధము లగుస్త్రీలయలంకారములతోఁ బోల్చియుండ మనకవియు నట్లే నుడివియుండెను. చూడుఁడు: శృంగారప్రకాశము [చెన్నపురిలోని వ్రాఁతప్రతి II సం. 266 పు.]

అలఙ్కారాశ్చ త్రిధా—బాహ్యాః, ఆభ్యన్తరాః, బాహ్యాభ్యన్తరాశ్చ. తేషు బాహ్యాః వస్త్రమాల్యవిభూషణాదయః; ఆభ్యన్తరాః దన్తపరికర్మ-నఖచ్ఛేదా-లకపరికల్పనాదయః; బాహ్యాభ్యన్తరాః స్నానధూప (విలేపనాదయః).

చూ. రసార్ణవము [3 పరి. 5-8 శ్లో. 12 పు.]

అందువలన ప్రకాశవర్షుఁ డీమూఁడువిధము లగునలంకారములను గూర్చియుఁ జర్చించి యుండు నని నొక్కి వక్కాణింపవచ్చును. కాని మనకు లభించిన వ్రాఁతప్రతిలో (3 వ పరి.) బాహ్యము లగు శబ్దాలం

1 'Journal of Oriental Research'—Vol. VIII. Part 3. P. 268-9.

కారములను, (4 వ పరి.) అభ్యంతరము లగునర్థాలంకారములను గూర్చిన చర్చమాత్రము గలదు. పిమ్మట రసప్రకరణముయొక్క యుపసంహారభాగముగల 2 పుటల గ్రంథము మాత్రము లభించినది. కావున బాహ్యాభ్యంతరము లగునుభయాలంకారముల విమర్శించు 5 వ పరి. కూడఁ బూర్తిగా నుత్పన్న మైనదని నిర్ణయింపఁదగును. దీనిని బట్టి రసప్రకరణముననే కాక యలంకారప్రకరణమునఁ గూడ గ్రంథపాత మున్న దనియు, రసార్ణవ మాఱుపరిచ్ఛేదముల గ్రంథ మనియుఁ దేలుచున్నది.

6 రసార్ణవమీమాంస.

౧ వ పరిచ్ఛేదము [దోషప్రమోషము.]:-

దోషములు 3 విధములు-1. పదదోషములు. 2. వాక్యదోషములు. 3. వాక్యార్థదోషములు. ఇందు- పదదోషములు 14 తెగలు.

1. అసాధువు.
2. అనిబద్ధము.
3. కష్టము.
4. క్లిష్టము.
5. అనర్థకము.
6. అపుష్టార్థము.
7. గూఢార్థము.
8. అప్రతీతము.
9. ససంశయము.
10. నేయార్థము.
11. అసమర్థము.
12. అప్రయోజకము.
13. దేశ్యము.
14. గ్రామ్యము.

ఇందు, కడపటి గ్రామ్యదోషము- i. అసభ్యము. ii. అమంగళము. iii. ఘృణాకరము-అని 3 తరగతులుగా విభజింపఁబడెను.

వాక్యదోషములును 14 :-

1. శబ్దహీనము.
2 క్రమభ్రష్టము.
3. విసంధి.
4. పునరుక్తము.
5. వ్యాకీర్ణము.
6. భిన్నవృత్తము.
7. సంకీర్ణము.
8. గర్భితము.
9. భిన్నలింగము.
10 భిన్నవచనము.
11. ఖంజము.
12. న్యూనము.
13. అధికము.
14. శ్లేషాదిగుణహీనము.

ఇందాఱవది యగు భిన్నవృత్తము మరల వర్ణభ్రంశము, యతిభ్రంశము నని రెండువిధములు.

గుణములు 3 తరగతులు- 1. శబ్దగుణములు. 2. అర్థగుణములు. 3. ఉభయగుణములు.

1. శబ్దగుణములు 3 :-(అ) శ్లేష. (ఆ) సమత. (ఇ) సుకుమారత.

2 అర్థగుణములు 3 :- (అ) అర్థవ్యక్తి. (ఆ) ప్రసాదము. (ఇ) కాంతి.

3. ఉభయగుణములు 4 :- (అ) ఓజస్సు. (ఆ) మాధుర్యము. (ఇ) ఔదార్యము. (ఈ) సమాధి.

పై వాక్యదోషములలోని 'శ్లేషాదిగుణహీనము'నందలి 'ఆది'పదముచే నీ 10 గుణములయొక్క యభావమే 10 దోషములుగా నెంచఁబడెను. ఈదోషములేవన-

1. శ్లేషవిపర్యయము.
2. సామ్యవిపర్యయము.
3. సౌకుమార్యవిపర్యయము.
4. అర్థవ్యక్తివిపర్యయము.
5. ప్రసాదవిపర్యయము.
6. కాంతివిపర్యయము.
7. ప్రౌఢివిపర్యయము.
8. మాధుర్యవిపర్యయము.
9. ఔదార్యవిపర్యయము
10. నిస్సమాధి.

వాక్యార్థదోషములు 16 :-

1. అపార్థము.
2. వ్యర్థము.
3. ఏకార్థము.
4. ససంశయము.
5. అపక్రమము.
6. భిన్నము.
7. అతిమాత్రము.
8. విరసము.
9. పరుషము.
10. హీనోపమ.
11. అధికోపమ.
12. విసదృశోపమ.
13. అప్రసిద్ధోపమ.
14. నిరలంకారము.
15. అశ్లీలము.
16. విరుద్ధము.

ఇందలి విరుద్ధదోషము 3 విధములు.

1. ప్రత్యక్షవిరుద్ధము. [3 విధములు.]
   - ౧. దేశవిరుద్ధము.
   - ౨. కాలవిరుద్ధము.
   - 3. లోకవిరుద్ధము.
2. అనుమానవిరుద్ధము. [3 విధములు.]
   - ౧. యుక్తివిరుద్ధము.
   - ౨. ఔచిత్యవిరుద్ధము.
   - 3. కామశాస్త్రవిరుద్ధము.
3. ఆగమవిరుద్ధము.

పైవానిలోఁ గాలవిరుద్ధ మిందు వివరింపఁబడలేదు. కాని ౩ వ పరిచ్ఛేదమునందు (85 శ్లో.) 'దోషః కాలే విరోధోఽపి న కార్యాన్తర హేతుతః' [కార్యాంతరహేతువులచేఁ గాలవిరోధము దోషముకాదు.] అని చెప్పఁబడియుండుటచేఁ గావలయు మొదటిపరిచ్ఛేదమున నీవివరణము కవిచే వదలఁబడియుండును.

భామహుఁడు 15 దోషములనే పేర్కొనియెను; కాని వానిని పద-వాక్య-వాక్యార్థగతము లని విభజింపలేదు. యుక్తి-ప్రతిజ్ఞావిరుద్ధముల నీతఁ డంగీకరించెను. 'పునరుక్త' దోష మర్థగత మగునప్పుడు 'నేయార్థ' మగు నని యీతఁ డనెను.

దండి యర్థ-శబ్దగతము లగు 10 దోషములనే పేర్కొనెను. యుక్తి (=హేతు) విరుద్ధ-ప్రతిజ్ఞావిరుద్ధములు గుణములా, కావా యనువిషయమున నాలంకారికుల విప్రతిపత్తిని సూచించియున్నాఁడు.

వాక్యదోషములు 2:-న్యూనము, అధికము. వాక్యార్థగతము లగుచో నివియే- న్యూనోపమ, అధికోపమ- అనుదోషము లగును. వాక్య-వాక్యార్థగతభేదమే తప్ప పై రెండుదోషములకు వ్యత్యాసము లేదు. వాక్యార్థదోషములలో నుపమాదోషములు నాలుగు పేర్కొనఁబడెను. ఇందు న్యూనోపమ, అధికోపమలను దండిభామహు లిరువురు నుదాహరించియుండిరి. అప్రసిద్ధోపమ, విసదృశోపమలను భామహుఁడొక్కఁడే వివరించియుండెను. దండి వీనిని బేర్కొనసే లేదు. ప్రకాశవర్షుఁడు పేర్కొనిన పైయుపమాదోషముల నాలుగింటినే కాక యుపమానము- ఉపమేయములలో లింగ-వచన-వ్యత్యాసమువలనఁ గలుగు మఱి రెండుపమాదోషముల దండిభామహులు నుడివియున్నారు. ఈరెండింటిని ప్రకాశవర్షుఁడు భిన్నలింగ-భిన్నవచనము లని నుడివి వీనిని వాక్యదోషములలోఁ జేర్చియున్నాఁడు. 'విపర్యయము' (అసదృశత ?) అను నేడవయుపమాదోషమును భామహుఁడొక్కఁడే నుడివియున్నాఁడు. తనకంటెఁ బ్రాచీనాలంకారికుఁ డగుమేధావి యీయుపమాభేదముల నేడింటిని బేర్కొనె నని భామహుఁడు వ్రాసియున్నాఁడు.[భామహ. II పరి. 40 శ్లో.]

౨. పరిచ్ఛేదము. [గుణోపాదానము.]

గుణములు 2 విధములు 1. శబ్దగుణములు. 2. అర్థగుణములు. మరల శబ్దగుణములలో 22 భేదములు, అర్థగుణములలో 22 భేదములు. ఈ 22 గుణభేదములపేళ్లు రెంటికిని సమానము—

1. శ్లేష.	9. ఉదాత్తత.	17. సంక్షేపము.
2. ప్రసాదము.	10. ఓజస్సు.	18. విస్తరము.
3. సమత.	11. ఔర్జిత్యము.	19. సామ్మిత్యము.
4. మాధుర్యము.	12. ప్రేయస్సు.	20. భావికత్వము.
5. సుకుమారత.	13. సుశబ్దత.	21. రీతి.
6. అర్థవ్యక్తి.	14. సమాధి.	22. ఉక్తి.
7. కాంతి.	15. సూక్ష్మము.	
8. ఔదార్యము.	16. గాంభీర్యము.	

ఈనామము లన్నియును సార్థకములు. ఈగుణములను దృష్టియం దుంచుకొని శబ్దములను వాక్యములను సరిగాఁ బ్రయోగించునది యని ప్రకాశవర్షుఁ డనుశాసించియున్నాఁడు.

భామహుఁడు మాత్రము కావ్యవిధాయకము లగు గుణముల నేప్రకరణమునను వివరించియుండలేదు; దండి యన్ననో వైదర్భమార్గ మున కత్యావశ్యకములగు పదిగుణములను మాత్రము నుడివియుండెను. వైదర్భి-గౌడీమార్గముల భేదములఁ గొన్నిటి నీతఁడు చెప్పియుండెను, గాని, గౌడమార్గప్రధానము లగుగుణములఁ గూర్చి యేమియు నెత్తుకొ నలేదు. ప్రకాశవర్షునిచేఁ జెప్పఁబడిన గుణములు దండిభామహులకృ తులలో నలంకారములుగా నెంచఁబడియుండెను. ఇట్లగుట కీముగ్గురకృ తులలో నాయాగుణములకు నాపేరుగల యలంకారములకుఁ గలలక్షణ సామ్యమే హేతువు.

శ్లో. 'వదన్తి బన్ధవైకట్య మౌదార్యం కవిపుఙ్గవాః
శ్లాఘ్యైర్విశేషణైర్యుక్త ముదాత్త మితి తద్విదుః.'

అని ప్రకాశవర్షుఁడు [౨ పరి. 16 శ్లో.] చెప్పియుండఁ గొంద ఱాలంకారికు లీయుదాత్తలక్షణము నుదారము (ఔదార్యము)న కారో

పించినట్లు దండి వ్రాసియున్నాఁడు. 'శ్లాఘ్యై ర్విశేషణై ర్యుక్త ముదారం కైశ్చి దిష్యతే.' గుణవివరణమునకుఁ బిమ్మటఁ బ్రథమపరిచ్ఛేదమునఁ జెప్పఁబడిన దోషములు నలువదినాలుగింటిలో నొక్క 'విరస' మనునది తక్కఁ దక్కినవి కొన్ని యెడల గుణత్వము నొందు నని వివరింపఁబడెను. 'విరస' మిందులోఁ జేరకుండుటకు హేతువు 'కాలవిరోధము' నకు వలె గ్రంథపాతమో లేక కవియే దీనిని నపవాదముగా నెంచియుండెనో చెప్పఁజాలము.

శ్లో. 'దోషాణామపి యేషాం స్యా ద్గుణత్వం కారణాత్క్వచిత్
చతుర్వింశత్త దుద్యస్తే శేష వైశేషికా గుణాః-' ప్రకాశ. ౨ పరి. 35-36.

దోషములు నలువది యని యిటఁ జెప్పఁబడినది. కాని క్రిందటి పరిచ్ఛేదమున 43 దోషములు వివరింపఁబడి యుండుటచే నిటఁ బూర్వాపరవైషమ్యము గానఁబడుచున్నది.

మొదట-పదదోషముల గుణత్వము, అపిమ్మట వాక్యదోషముల గుణత్వము, వాక్యార్థదోషముల గుణత్వము నిట్లు మొదటిపరిచ్ఛేదము నందలి క్రమమే పాటింపఁబడియెను. మొదటిపరిచ్ఛేదమున గుణములను జెప్పినపిమ్మట- (24-28 శ్లో.)

1. శ్లేషగుణాభావము- శైథిల్యదోషము.
2. సామ్యగుణవిపర్యయము- వైషమ్యదోషము.
3. సౌకుమార్యగుణరాహిత్యము- కఠోరము.
4. అర్థవ్యక్తిహీనత- నేయార్థము.
5. ప్రసాదగుణాభావము- అప్రసన్నము.
6. కాంతిగుణలోపము- అవ్యుత్పన్నత.
7. ప్రౌఢి(ఓజో)గుణవిహీనత- అప్రౌఢి.
8. మాధుర్యలోపము- అనిర్వ్యూఢము.
9. ఔదార్యవిపర్యయము- నిరలంకారము.
10. నిస్సమాధిగుణలోపము- ఋజుమార్గము.

ఇందు నేయార్థము ప్రత్యేకముగా వాక్యదోషముగాను, నిరలంకారము వాక్యార్థదోషముగాను గూడఁ జెప్పఁబడినవి. శ్లేషాదిగుణహీ

నతవలనఁ గలుగు నీవదిదోషములను ప్రకాశవర్షుఁడు వివరించినపద్ధతిని బట్టి యాలోచించిన నాయాగుణముల యభావము నీతఁడు విశేషదోషములుగాఁ బరిగణించినట్లు లేదు. మ తే మన నీవదిగుణములును దక్కిన గుణములును గావ్యమున కత్యావశ్యకము లైన ట్లీతని దృఢాభిప్రాయముగాఁ దోఁచెడిని. దండియు నిట్టియభిప్రాయముతోడనే శ్లేషాదిదశగుణములను మాత్రమే పేర్కొనియుండెను, గాని, వానియభావమును దోషములుగా నెంచియుండ లేదు.

వేంకటరామశర్మగా రిట్లు వ్రాసియున్నారు:-[1]

“భామహుఁడు దండియుఁ గావ్యలక్షణములను దద్భేదములను విపులముగాఁ జర్చించియుండిరి. వారి కుపజీవ్య మగు గ్రంథ మొకటి యుండవలెను. అది యీరసార్ణవమే. ఇందు ద్వితీయపరిచ్ఛేదము-

‘నిర్దిష్టస్యాపి కావ్యస్య గుణోపాదాన మన్తరా’

అని ప్రారంభింపఁబడెను. దీనినిబట్టి మనకవి కావ్యలక్షణములను దద్భేదములను గ్రంథాంతరమున వివరించియుండుటచే నాప్రసంగము నిట విడిచె నని యూహింపనగును. మఱియు నితరాలంకారగ్రంథములందువలె నిందాశీర్నమస్క్రియాపూర్వక మగుకృత్యాది గాని, గ్రంథకర్తృప్రశస్తి గాని, యనుబంధచతుష్టయనిరూపణాదులు గాని లేవు. ప్రథమపరిచ్ఛేదము దోషవిచారకము. వీని నన్నిటిం బట్టి చూచినఁ గావ్యనిర్దేశప్రకరణాదులు గల మఱికొన్ని ప్రకరణము లుత్సన్నము లైయుండితీరు నని నిర్ణయింపఁ జనును.”

ఈయభిప్రాయములు చాలవఱకు విమర్శపూర్వకములు. రసార్ణవము దండిభామహుల కుపజీవ్య మెంతమాత్రమును గా దనియు, వీరిరువురకంటెను రసార్ణవకర్త చాల నవీనుఁ డనియుఁ గాలనిర్ణయాదిప్రకరణముల నిరూపింపఁబడినది. కృత్యాదిగ్రంథము కొంత లోపించిన లోపింపవచ్చును. మొదటి పరిచ్ఛేదమున దోషములు వివరింపఁబడెను. రెండవపరిచ్ఛేదమునగుణవిచారము చేయఁబడెను. అందువలనఁ గావ్యము నిర్దుష్టమైనను, గుణసహితము కానిచో సాధువు కానేర దనుపాతమే-

1. Introduction to ‘Rasarnava.’—P. XVI.

'నిర్దుష్టస్యాపి కావ్యస్య గుణో'పాదాన మన్తరా
శాస్త్రార్థకుశలో లోకః సాధుత్వం నా నుమన్యతే.'
సహేతుకముగాఁ జూపట్టుచున్నది.

3 వ పరిచ్ఛేదము. [శబ్దాలంకారప్రకాశనము.]

మొదట నలంకారసామాన్యలక్షణములు విశదముగాఁ జూపఁబడినవి. 1. బాహ్యములు. 2. అభ్యంతరములు. 3. ఉభయములు- అని యలంకారములు మూఁడువిధములు. బాహ్యములగు శబ్దముల కుత్కర్షాధాయకము లగుటచే శబ్దాలంకారములు బాహ్యము లనఁబడెను. అభ్యంతరము లగు కావ్యార్థముల కౌన్నత్యముం జేకూర్చునవి యగుటచే నర్థాలంకారము లాభ్యంతరకక్ష్యలోఁ జేర్పఁబడెను. ఉభయాలంకారకక్ష్యలో నేయలంకారములు చేరునో మనకవి చెప్పియుండలేదు. కాని యాతనివివరణమునుబట్టి యూహించిన, శ్లేషాదు లిందుఁ జేరునేమో యని తోఁచెడిని.

శబ్దాలంకారములు 18 :-

1. జాతి.	7. ఛాయ.	13. ఔచిత్యము.
2. రీతి.	8. యుక్తి.	14 ప్రశ్నోత్తరము.
3. వృత్తి.	9. భణితి.	15. ప్రహేలిక.
4. రచన.	10. శ్రవ్యత.	16. అనుప్రాస.
5. ఘటన.	11. శ్లేష.	17. యమకము.
6. ముద్ర.	12. చిత్రము.	18. గూఢోక్తి.

సంస్కృతప్రాకృతాత్మకమగు 'జాతి' శుద్ధ, సాధారణి యని రెండు విధములు. దండిభామహులు భాషల సామాన్యనామమునుగాని, శుద్ధ, సాధారణి యను తద్భేదములఁ గాని నుడువక భాషాసామాన్యమును సంస్కృతప్రాకృతాపభ్రంశము లని విభజించియుండిరి. దండి మిశ్ర మను మఱియొక భేదమును గూడఁ గల్పించియున్నాఁడు. ఇవన్నియు వాఙ్మయ భేదము లని యాతఁ డనియున్నాఁడు.

రీతులు 5 :-1. వైదర్భి. 2. గౌడి. 3. పాంచాలి. 4. లాటి. 5. ఆవంతి. ఆయాదేశములలోని జనుల యభిరుచుల ననుసరించి చేయఁ

బడువచోవిన్యాసమే రీతి యనఁబడును. దేశము లనేకములు; అందలి జనులరుచిభేదములు ననేకములు. అందుచే రీతులభేదముల నెన్నుటకు సర్వజ్ఞుఁడగు నీశ్వరుఁ డొక్కఁడే సమర్థుఁ డని యాతఁడు నుడివియున్నాఁడు.

దండిమతమున రీతు లనేకములు. అందు సూక్ష్మభేదములు గల తక్కినవానిని వదలివైచి ప్రస్ఫుటవ్యత్యాసముగల వైదర్భ-గౌడీయముల మాత్రము దండి విశేషముగా వర్ణించియున్నాఁడు.

వృత్తులు:-1. కైశికి. 2. ఆరభటి. 3. భారతి. 4. సాత్వతి. ముద్ర (=సాభిప్రాయార్థవిన్యాసము) 4 విధములు:-1. విభక్తిగతము. 2. వచనగతము. 3. సంవిధానగతము. 4. సముచ్చయగతము.

అన్యోక్తుల ననుకరించుట ఛాయ. ఇది 5 విధములు.1. లౌకికము. 2. స్ఖలితము. 3. ఛేకము 4. ముగ్ధము. 5. వేటోక్తి. జను లసంఖ్యాకు లగుటచే నన్యోక్తిచ్ఛాయాభేదములు ననంతము లని యాతఁ డనెను.

విశేషము:-ఈఛాయ నితరాలంకారికులు శబ్దార్థహరణము, హరణము, ఉపజీవనశక్తి మొదలగుపేళ్లతో వ్యవహరించిరి. వామనుఁడు నానందవర్ధనుఁడు తమకృతులలో నీవిషయమును స్పృశించియున్నారు. ఈవిషయమును గూలంకషముగ సోదాహరణముగఁ జర్చించిన మహనీయుఁడు రాజశేఖరుఁడు. ఈతఁడుకావ్యమీమాంసయందు మూఁడు ప్రకరణములు [XI—XIII] తద్విచారమునకు వినియోగించెను. హేమచంద్రుఁడు తన'కావ్యానుశాసనము'నకుఁ దాను రచించిన 'వివేక' మను వృత్తిలోను, వాగ్భటుఁడు'కావ్యానుశాసనము' నను నిందలివిషయము లనేకములఁ బరిగ్రహించియుండిరి. భోజుని 'సరస్వతీకంఠాభరణము'నందు నీవిషయ మించుక కలదు. క్షేమేంద్రుఁడు కవిశిక్షాగ్రంథమగు తన 'కవికంఠాభరణము'న నీవిషయమును విపులముగఁజర్చించియున్నాఁడు. రాజశేఖరుఁడు [XIఅధ్యా. 61 పు.] ఈవిషయమును గూర్చి యొకచక్కని యాభాణకమును క్రోడీకరించియున్నాఁడు: 'లోకమునఁ జోరుఁడుగాని కవి గాని, వర్తకుఁడు గాని యుండఁడు. ఎవఁడు తనచౌర్యమును గప్పిపుచ్చుకొనఁగలఁడో వాఁడు నింద నొందక యానందము నందును.'

యుక్తి 6. విధములు:-1. పద 2. పదార్థ 3. వాక్య 4. వాక్యార్థ 5. ప్రకరణ 6 ప్రబన్ధయుక్తులు.

భణితి 4 భేదములు:-1. సంభావనారూపము. 2. అసంభావనారూపము. 3. కల్పనారూపము. 4. విరోధరూపము.

శ్రవ్యత 6 తెగలు:-1. ఆశీరూపము. 2. నమస్క్రియారూపము. 3. నాందీరూపము. 4. వస్తురూపము. 5. బీజరూపము. 6. ప్రరోచనారూపము.

శ్లేష 6 రకములు:-1. ప్రకృతి, 2. విభక్తి, 3. పద, 4. వచన, 5. భాషా, 6. ప్రత్యయశ్లేషలు.

ఔచిత్యము 2 విధములు:-1. అభిధానౌచిత్యము. 2. బన్ధౌచిత్యము.

[ఔచిత్యమునుగూర్చి విపులముగ నెఱుఁగఁ గోరువారు క్షేమేంద్రుని 'ఔచిత్యవిచారచర్చ'ను బరిశీలింపఁదగును. ఔచిత్యమే కావ్యమున కాత్మ యని యీతనిమతము.]

ప్రశ్నోత్తరము 6 విధములు:- 1. అంతఃప్రశ్న. 2. బహిఃప్రశ్న. 3 ఉభయప్రశ్న. 4. పృష్టప్రశ్న. 5. ఉత్తరప్రశ్న. 6. జాతిప్రశ్న. ఈప్రశ్నోత్తరమునుగూర్చిన విశేషముల నరయఁగోరువారు 'విదగ్ధముఖమండనము'ను బఠింపఁజను నని ప్రకాశవర్షుఁడే చెప్పియున్నాఁడు. ప్రకాశవర్షుని కాలనిర్ణయమున కీగ్రంథ మెట్లుపయోగించునో కాలనిర్ణయప్రకరణమునఁ జూచునది.

ప్రహేళిక 6 విధములు:- 1. పరివర్తితము. 2. విన్యస్తము. 3 లుప్తము. 4. వ్యుత్క్రమము. 5. బిందుకము. 6. అర్థము.

[భామహుఁడు ప్రహేళికకు లక్ష్యముం జూపక, ప్రహేళికకు యమక మని నామాంతరము గల దనియుఁ దద్విశేషముల రామశర్మకృతమగు 'అచ్యుతోత్తరము'నఁ జూడఁదగు ననియు నుడివెను [భామహ. II. 19.] దండి యమక మేకాంతమధురము కాకపోవుటచేఁ దరువాత దీనినిగుఱించి చెప్పెద నని [కావ్యాదర్శ. I. 61] నుడివి, తృతీయపరిచ్ఛేదమున 14 ప్రహేళికాభేదములను సోదాహరణముగా వివరించియున్నాఁ

డు. విశ్వనాథకవిరాజు [సాహిత్యదర్పణము X. 13.] రసపరిపంథియగు టచేఁ బ్రహేళిక యలంకారము కాదనియు, నిది 'ఉక్తివైచిత్ర్య' మాత్ర ప్రయోజక మనియు వ్రాసియున్నాఁడు. అంతకుమునుపే భోజుఁడు 'సరస్వతీకంఠాభరణము'నఁ బ్రహేళికాప్రయోజనములకు దండిశ్లోకము నుదాహరించియున్నాఁడు:

'క్రీడాగోష్ఠీవినోదేషు తజ్జ్ఞైరాకీర్ణమన్త్రణే
పరవ్యామోహనే చాపి సోపయోగాః ప్రహేళికాః.'

ఈశ్లోకము రసార్ణవమున గ్రహింపఁబడి నది [3. 82.]

దండి చెప్పినప్రహేళికాభేదములకు ప్రకాశవర్షుఁడు చెప్పినవానికి సాదృశ్యము లేదు.]

యమకము 7 తరగతులు:

1. అవ్యపేతము. (నియతము).
2. అవ్యపేతము. (అనియతము).
3. వ్యపేతము. (నియతము).
4. వ్యపేతము. (అనియతము).
5. అవ్యపేతవ్యపేతకము. (నియతము).
6. అవ్యపేతవ్యపేతకము. (అనియతము).
7. సముద్గకము.

భామహునిమతమున యమకము 5 విధములు: 1. ఆది. 2. మధ్యాన్తము. 3. పాదాభ్యాసము. 4. ఆవలి. 5. సమస్తపాదయమకములు

సందష్టక-సముద్గకాదిభేదముల నీతఁ డీయైదింటిలోనే యిమిడ్చెను. ప్రకాశవర్షుఁడు పేర్కొనిన యేడిటికి నధికముగా దండికృతియందీ 5 ను వివరింపఁబడినవి: 1. సందష్ట, 2. సముద్గ, 3. శ్లోకాభ్యాస, 4. మహాయమక, 5. ప్రతిలోమయమకములు. ఇతరులు కొందఱు సందష్టమును దక్షిణభేదములలో నంతర్భూతముగా నొనర్చినను దానుమాత్రము దీనికిఁ బ్రత్యేకస్థానము నొసఁగుచున్నాఁడ నని దండి చెప్పియున్నాఁడు. తనకృతిలో(III పరి.) నీతఁడు యమకభేదముల 78 శ్లోకములలో వివరించియున్నాఁడు.

'ప్రాయేణ యమకే చిత్రే రసపుష్టిర్న దృశ్యతే'

అని మఱియొక సాహిత్యవేత్త యమకచిత్రములు రసపోషకములు గావనియే నుడివియున్నాఁడు. ప్రకాశవర్షుఁడు మాత్రము యమకము కవిపాండితికి గీటురాయివంటి దని

['కవివ్యుత్పత్తినికషం యమకం వాచ తద్విదః'- 3. పరి. 61.] చెప్పియున్నాఁడు.

మనకవి ప్రహేలికకుఁ బిమ్మట ననుప్రాసమును [3 పరి. 14.] చేర్చియుండినను మనకు లభించినప్రతిలోఁ బ్రహేళిక తర్వాత యమకము చెప్పఁబడినది; అనుప్రాస విడువఁబడినది. అనుప్రాసవివరణభాగ ముత్సన్నమైన దని చెప్పవచ్చును.

యమకభేదముల వివరించునవసరమున ప్రకాశవర్షుఁడు-

'లక్ష్యలక్షణబోధార్థం దిఙ్మాత్రం తు ప్రదర్శ్యతే'-[3 పరి. 64.]

అని చెప్పినను లక్ష్యలక్షణము లిందు మృగ్యములుగా నున్నవి.

గూఢోక్తి 5 విధములు: 1. క్రియాభేదము. 2. కారకభేదము. 3. సంబంధభేదము. 4. పదభేదము. 5. అభిప్రాయభేదములవలనఁ గలుగునవి.

ఈశబ్దాలంకారములు వాగ్దేవికి నవయవాలంకారములుగాఁ జెప్పఁబడినవి. ఔచిత్యమును రసమును బాటించుచు సందర్భశోభకై వీనిని గవులు పద్యగద్యముల నుపయోగింపవలయు నని యీతనియభిప్రాయము.

పిమ్మట శ్లేషచిత్రముల ప్రాముఖ్యము, ననుప్రాసాక్లిష్టయమకముల ప్రాధాన్యము వివరింపఁబడెను. బాణునకుఁ బద్యరచనమునకంటె గద్యరచనమునఁ గలయధికకౌశలము, సంస్కృతప్రాకృతాదిభాషావిచారము, ఆఢ్యరాజ-శ్రీసాహసాంకప్రభువులకాలమునందలి భాషలను గూర్చినవివరములు గలవు. మంచిపుష్పముల నెంచి మాలనుగూర్చుమాలాకారునివలెఁ గవి కావ్యశోభాసంధాయకము లగువిషయముల గ్రహించి కావ్యనిర్మాణమును జేయఁదగు నఁట !

౪ వ పరిచ్ఛేదము. [అర్థాలంకారనిర్ణయము.]

అర్థాలంకారములు 28:-

1. జాతి.
2. హేతువు.
3. అహేతువు.
4. సూక్ష్మము.
5. సారము.
6. సమాహితము.
7. భావము.
8. విభావన.
9. అన్యోన్యము.
10. విరోధము.
11. విషమము.
12. సంభవము.
13. ప్రత్యనీకము.
14. వ్యతిరేకము.
15. అసంగతి.
16. లేశము.
17. పరివృత్తి.
18. నిమీలనము.
19. వితర్కము.
20. స్మరణము.
21. భ్రాంతి.
22. అభావము.
23. ఆగమము.
24. ఉపమానము.
25. అనుమానము.
26. ప్రత్యక్షము.
27. సంశయము.
28. అతిశయము.

ఇందు 1, 3, 5, 7, 9, 11-13, 15, 18-26 భామహుని కృతిలో లేవు. భామహుఁడు మఱికొన్నియలంకారములఁ జేర్చెను.

1. అర్థాంతరన్యాసము.
2. అనన్వయము.
3. అపహ్నుతి.
4. అప్రస్తుతప్రశంస.
5. ఆక్షేపము.
6. ఆశీస్సు.
7. ఉత్ప్రేక్ష.
8. ఉదాత్తము.
9. ఉపమ.
10. ఉపమేయోపమ.
11. ఊర్జస్వి.
12. తుల్యయోగిత.
13. దీపకము.
14. నిదర్శన.
15. పర్యాయోక్తము.
16. ప్రతివస్తూపమ.
17. ప్రేయస్సు.
18. భావికము.
19. యథాసంఖ్యము.
20. రసవత్తు.
21. రూపకము.
22. విశేషోక్తి.
23. వ్యాజస్తుతి.
24. శ్లేష.
25. సమాసోక్తి.
26. సహోక్తి.
27. సంసృష్టి.
28. స్వభావోక్తి.

ఇవి ప్రకాశవర్షునికృతియందు మృగ్యములు. దండి మొత్తము 35 అలంకారములను సోదాహరణముగ వివరించెను. ఇతఁడు పేర్కొనిన వానిలోఁ దొమ్మిది రసార్ణవమునను [2, 4, 6, 8, 10, 14, 16, 17,

28] గలవు. ఇవి కాక దండికృతియం దీక్రింది వధికముగాఁ గానవచ్చు చున్నవి-

1. స్వభావోక్తి.
2. ఉపమ.
3. రూపకము.
4. దీపకము.
5. ఆవృత్తి.
6. ఆక్షేపము.
7. అర్థాంతరన్యాసము
8. సమాసోక్తి.
9. ఉత్ప్రేక్ష.
10. క్రమము.
11. ప్రేయస్సు.
12. రసవత్తు.
13. ఊర్జస్వి.
14. పర్యాయోక్తము.
15. ఉదాత్తము.
16. అపహ్నుతి.
17. శ్లేష.
18. విశేషము.
19. తుల్యయోగిత.
20. అప్రస్తుతప్రశంస.
21. వ్యాజస్తుతి.
22. నిదర్శన.
23. సహోక్తి.
24. ఆశీస్సు.
25. సంకీర్ణము.
26. భావికము.

దండిభామహు లిరువురు నలంకారములుగా నెంచిన- 1. ప్రేయస్సు. 2. ఊర్జస్వి. 3. ఉదాత్తము. 4. భావికములను మనకవి గుణములుగా మార్చెను. దండిభామహులచే నర్థాలంకారముగాఁ జేర్పఁబడిన శ్లేష మనకవిచే శబ్దాలంకారములలోఁ జేర్పఁబడెను. పిమ్మట మనకవి జాతి నర్థాలంకారములలో మొకటిదానినిగా నుడివెను. శబ్దాలంకారములలోఁ గూడ జాతిని మొకటిదానినిగా నీతఁ డెంచెను.

హేతువు 6 విధములు:- 1. ప్రవర్తకము. 2. నివర్తకము. 3. అభావము. 4. జ్ఞాపకము. 5. ప్రయోజకము. 6. చిత్రము.

దండి హేతువు నాలుగువిధము లనియెను. రసార్ణవమునందలి 6 హేతువులలో మొదటి రెండును దక్కఁ దక్కినవి దండికృతిలోఁ జూపట్టు చున్నవి. మనకవి 'ప్రయోజక' మనిన దానిని దండి 'కారక' మనెను. మఱియు నీతఁడు 'జ్ఞాపక-కారకములు' ప్రవృత్తి-నివృత్తులలోఁ జేరువ నెను. కారకము-1. నిర్వర్త్యము. 2. వికార్యము. 3. ప్రాప్యము-అని 3 విధములనియు, i. దూరకార్యము. ii. కార్యసహజము. iii. కార్యాంతరజము. iv. అయుక్తకార్యము. v. యుక్తకార్యము మొదలుగా 'చిత్రహేతు' వనేకవిధము లనియు దండి నుడివెను. సూక్ష్మము రెండురకము లని దండి యన, రసార్ణవకర్త యాఱువిధము లనెను.

ధర్మి, ధర్మము నని సార మిఱుదెఱఁగులు. సమాహితముకూడ 2 విధములే. దండి సమాహితభేదములఁ జేర్కొనలేదు. విరోధము శబ్దాలంకారములలోఁ గూడఁ జేరును గాని, సంఖ్యాగౌరవభీతిచే దీని నా ప్రకరణమునఁ జెప్పక యిటఁ జేర్కొనుచుంటి నని రసార్ణవకారుఁడు వ్రాసియున్నాఁడు.

సంభవము 4 విధములు:- 1. విధి. 2. నిషేధము. 3. ఉభయరూపము. 4. ఉభయవర్జితము.

వ్యతిరేకము 7 తెఱఁగులు:- 1. ఏకవ్యతిరేకము. 2. ఉభయవ్య. 3. సదృశవ్య. 4. అసదృశవ్య. 5. సజాతివ్య. 6. వ్యక్తివ్య. 7. రూపకప్రకృతి.

[భామహుఁడు వ్యతిరేకమును జేర్కొనియెను గాని తద్భేదములఁ జెప్పలేదు. దండి వ్యతిరేకభేదముల నేడింటినినుడివెను: 1. ఏకవ్యతిరేకము. 2. ఉభయవ్య. 3. సశ్లేషవ్య. 4. సాక్షేపవ్య. 5. సహేతువ్య. 6. సాదృశ్యవ్య. 7. సజాతివ్యతిరేకము. ఇందు 1, 2, 6, 7 లను రసార్ణవకర్త గ్రహించెను. దండి సాదృశ్యవ్యతిరేకభేదములఁగూడఁ గొన్నిటిని జేర్కొనెను.]

అభావాలంకారము 4 తెఱఁగులు:- 1. ప్రాగభావము. 2. ప్రధ్వంసాభావము. 3. అత్యంతాభావము. 4. కల్పితాభావము. ఇట సంసర్గాభావమే పేర్కొనఁబడినది కాని యన్యోన్యాభావము చెప్పఁబడలేదు. కొందఱు నైయాయికులీసంసర్గాభావమును బైనాలుగువిధములుగా విభజింతురు. కాని కొందఱు సంసర్గాభావము త్రివిధ మని పైవానిలో నొకటి మూటిని జేర్కొందురు. కల్పితాభావమునకు సామయికాభావ మని నామాంతరము.

అగమాలంకారము 4 విధములు:- 1. ధర్మము. 2. అర్థము. 3. కామము. 4. మోక్షము. ధర్మోపార్జనము ప్రవృత్తినివృత్తులచే నగును.

అర్థము 3 తెగలు:- 1. పిత్ర్యము. 2. స్వము. 3. సంచితము. పిమ్మట నర్థశాస్త్రగ్రంథములు, నర్థశాస్త్రమునందలి దశస్కంధములు పేర్కొనఁబడినవి.

కఠినశ్లోకార్థము.

— కొండపేటి వెంకయ్యచౌదరీగారు- క్రోసూరు. —

శ్లో. పాయాద్వః కరణోరణోరణరణోరాణోరణోవారణో
దత్తాయేనరమారమారమరమా రామారమా సారమా
సశ్రీమానుదయోదయోదయుదయోదాయోదయో దేదయో
విష్ణుర్జిష్ణు రభీరభీ రభిరభీ రాభీరభీసారభీః.

ఈ శ్లోకము లో దశావతారములు చెప్పఁబడినవి.

టీక. శ్రీమాన్=సంపద్యుక్తుఁడైన (లక్ష్మీయుక్తుఁడయిన) అవతారములయందు సిరితోఁ గూడియుండునని- "రాఘవత్వే భవత్సీతా" ఇత్యాది విష్ణుపురాణము. కరణః- కే=ఉదకమునందు, రణతి= మెళ్లుచుండువాఁడు (కరణుఁడు) ఉదకములలోన సంచరించునది యని మత్స్యావతారముం జెప్పెను. అరణః=రణములేనివాఁడు. (యుద్ధాదిప్రహారకర్తలచేఁ గాక సామముచే శత్రువుల రూపడఁగించువాఁడు- (వామనావతారము) రాణః=రణసంబంధమైన, రణః=అయస్తంభధ్వనినుండి పుట్టిన, రణః=ప్రతిశబ్దమును గని వచ్చు రాక్షసులను, వారణః=వారించువాఁడు. (నరసింహావతారము) రమా=లక్ష్మి, యేన=ఏకూర్మ రూపముచేత, (సముద్రునకు) దత్తా=ఈయఁబడినదో-(కూర్మావతారము) అరమాః- అరః= సుదర్శనాంశమువలన నుత్పన్నమైన కార్తవీర్యుని, మినాతి=చంపువాఁడు, రమారమః=విష్ణువు, (వానియందు) రమాః=రమించువారలు, (రమారమరమాః) బ్రాహ్మణులు, అట్టివారలకు సంపాదించిన, అర=భూమి, (స్యాదరో యుద్ధకర్తణి, పిసునే చ ఖలా వపాన్నా వరాతు కమలే ల యోః- అని శ్రీహర్షనిఘంటువు.) (దానియొక్క) మా=సమృద్ధియు, రమా=జయలక్ష్మియు (ఎవనిచే) ఆసా=స్థాపింపఁబడినదో యట్టిది (పరశురామావతారము) ఉత్=మిక్కిలి, అయః=ధాన్యమునకు (అయో

దన్తే ధనేధాన్యేకల్యాణేకరణేపిచ - శ్రీహర్షని ఘంటువు) ఉదయః=ఉత్పత్తిభూత మైన భూమియందు దయః=దయగలవాఁడు. సర్వబీజాధారభూతమైన భూమిని హిరణ్యాక్షునిబారినుండి రక్షించినవాఁడు. (వరాహావతారమున) అదయదయః=దయలేని క్రూరులయందే దయగలఁవాడు. క్రూరులయందేదయగలవాఁడు తదతిరిక్తులయందుఁ జెప్పనవసరము లేదు. (సకలజనహితకరమైన బుద్ధావతారము చెప్పఁబడినది.)

దాయోదయోదా॥-దాయ=జ్ఞాతులందు, అదయాః=దయాశూన్యులయిన (దుర్యోధనాదులను), ద్యతి=ఖండించువారు (పాండవులు), వారియందు- దయః=దయగలవాఁడు, (శ్రీకృష్ణావతారము.) అభీరాః=భయరహితులైన- (దుష్టకార్యవిషయమున) రావణాదులకు, భీ=భయమును గల్పించి, రభః=సంహారక్రీడగలవాఁడు, (శ్రీరామావతారము) అభీరః=అభి=నిగమాదివ్యాప్తమైన, ఇరః=దేవత్వముగల బ్రాహ్మణులను ఆభీరాః=ఆ=అంతటను, భీ=భయమును, రా ని=గ్రహించువారుగాన- ఆభీరాః=అంతటను భయమునుబొందువా రని యర్థము. అట్టి వారలకు, భీసారభీః= భీ=భయమును, సార=ప్రసరింపఁజేయువారు, (ములుచలు) అట్టివారలకు, భీ=భయమును గల్గించువాఁడు- (కల్కి) సః=అట్టి, జిష్ణుః=జయశీలుఁడైన, విష్ణుః=సర్వవ్యాపకుఁడైన దేవుఁడు, వః=మిమ్ము, పాయాత్=రక్షించుఁగాత!

ఈశ్లోకమునకు శ్రీతిరుమలకూరాన్వయ... సరససాహిత్యచక్రవర్తి కంఠీరవ... విశిష్టాద్వైతసంప్రదాయ నిరాతంక వేంకటరంగాచార్యేణ విరచితోఽయ ముపన్యాసః. అని సంస్కృతవ్యాఖ్య వ్రాసినట్లు కనఁబడుచున్నది. శ్లోక మెవ్వరు రచించినదో తెలియదు.

మనవి.

విద్వద్వర్యులార! ఈక్రిందిశ్లోకమునకుఁ బలువురుకవులు రచించిన పూర్వపద్యములు కొన్నిచూపినారము. మఱియు నెందైనఁ బూర్వకవుల పద్యము లున్న వానిం బంపుమ నిప్పటికవులుం బండితులును దాముఁగూడ నొక్కొక్క పద్యమును రచియించి మాకుఁ బంపఁ గోరుచున్నారము. ఆంధ్రసాహిత్యపరిషత్పత్త్రికాధిపతి, కాకినాడ.

"ఉచ్చైర్గ ర్జగతి సిద్ధ్యతి ధర్మతశ్చే
త్తస్యప్రమాచ వచనైః కృతకేతరైశ్చేత్
తేషాం ప్రకాశనదశా చ మహీసురైశ్చే
త్తానన్తరేణ నిపతేత్క్వను మర్త్యనామః"—భోజరాజః.

ఉ. ఇంపడరంగ సద్గతి సమృద్ధినిదానము ధర్మమేని ధ
ర్మంబు నెఱుంగఁ జేయ మహిమం దగునట్టిది వేదమేని వే
దంబు భరించు వారు వసుధాసురులేని తదీయపాదప
ద్మంబులఁ దక్క నొక్కయెడ మామకమౌళిమదాళివ్రాలునే.

ఋగ్వేదికవి వేంకటాచలపతికవి.

మ. పరికింపందగు ధర్మవృత్తి సుగతుల్ ప్రాపించెనా దానిని
ల్వరముం గూర్పఁగనైన పల్కుబడుల న్వర్తిల్లెనా వానిని
ర్భరవిఖ్యాతి ధరాసురాగ్రణులచేఁ బాటిల్లెనా తన్మహ
త్తరులం జెందక యెందుఁ బోవఁగల వుద్యన్నమోవాకముల్.

నడిమింటి వేంకటపతి (అభిషిక్తరాఘవము)

క. ఇల మేల్గతిధర్మముచే
నలధర్మంబునకుఁ బ్రమయు నామ్నాయపదం
బులవానికి విద్యలచే
నలరం దశగలుగ వారి కగునానతియున్.

ఉ. ధారుణియందు మేటిగతి ధర్మముచే సమకూరె నేనియు
న్వారకదానికి న్నిజము వైదికవాక్యములంచ ఘటిల్లెనా
సారెకు వానికిం ఘనలసద్గతి విప్రులచేత నైనచో
వారలఁదప్ప మద్రచితవందన మొందువసించు నిత్యముల్.

చిత్రకవి రామాచార్యులు.

భోజభూపాలీయోపాఖ్యానంబను రఘునందనవిలాసము.

గీ. ధర్మమునఁ గల్గునే యున్నతగతి జగతి
యకృతకోక్తులఁ దత్ప్రమ యడరు నేని
వాని వెలయించువారలు పాఱులేని
వారిఁగాక నాదుప్రణతు లేరిఁ జెందు.

నిడమర్తి జలదుర్గాప్రసాదరాయకవిగారు.

చ. భువనమునందు నుచ్చగతి పొల్పుగధర్మమునుండి ప్రాపితం
బవునది యేని ధర్మపుయథార్థ మెఱుంగుట వేదవిద్యచే
నవునది యేని వేదముల నన్నిటినిం బ్రకటించురీతి వి
ప్రవరులచేత నేని మఱి వారినిగాక యొఁ జేరు మన్నతుల్.

అల్లమరాజు రంగశాయికవిగారు

చ. జనములు సద్గతిన్బొరయు సాధనమైనది ధర్మమేని య
ద్దానికి నకృత్రిమంబు నిగమంబె ప్రమాణమునయ్యె నేని దా
నిని ధరియించి మెంచి ధరణిన్వెలయింతురు పాఱులేని న
వ్వనమగు మత్ప్రణామములు వారికిఁగాక మఱేరికయ్యెడుల్.

పొన్నాడ కృష్ణమూర్తిగారు.

ఉ. ధారుణిలోన సద్గతినిదానము ధర్మమ యేని దాని కా
ధార మపౌరుషేకలితం బగువేదమ యేని వేదము
న్నేరిచి యాధరాస్థలిని నిల్పెడువారలు పాఱు లేని నా
పాఱులఁ గాక యింకఁ బెఱవారల నెవ్వరిఁ జేరు మన్నతుల్.

జయంతి రామయ్యపంతులుగారు.

గ్రంథస్వీకారము.

(1) నూతనరాజ్యాంగవిధానము.

రచయిత: తల్లాప్రగడ జగన్నాథరావుగారు, B.A., వెల 8 అణాలు.
కాకినాడలో, ప్రతులు: గ్రంథకర్తయొద్ద దొరుకును.

స్వపరిపాలనము, స్వాతంత్ర్యమును, ఓటుహక్కు మున్నగుభావములు ప్రబలి, నల్గడలఁ బ్రాఁకియున్న యీదినములలోఁ, బ్రతిమానవుఁడును, ప్రజలకు, ప్రభుత్వమునకు నొండొరులయెడఁ గలహక్కులు, బాధ్యతలు, సంబంధము తెలిసికొనవలసినయావశ్యకత మిక్కుటము.

ఈగ్రంథమున మొదటియేఁబదిపుటలందు నాంగ్లేయు లీదేశమున వర్తకమునకై ప్రవేశించి రాజ్యము నార్జించినది మొదలు 'కుంఫిణీ'పాలనమంత ముగియువఱకును, కుంఫిణీవారిని దొలఁగించి 1858 లో విక్టోరియారాణి భారతసార్వభౌమత్వము వహించిన దాది 1935 వఱకు మనపాలన మేవిధముగ నుండెనో, దిఙ్మాత్రముగ సూచితమై, 1935 వ సంవత్సరపు ఇండియాప్రభుత్వచట్టముప్రకారము నేఁ డమలునందున్న విధానమునకు పోద్ఘాతముగనున్నది. నేఁటిభారతరాజ్యతంత్రమున, సార్వభౌముఁడు భారత రాజ్యాంగమంత్రి, రాష్ట్రీయగవర్నరులు, రాష్ట్రీయశాసనసభలు, గవర్నరుజనరలు లేక వైస్రాయి, అఖిలభారతాంతరరాష్ట్రీయశాసనసభ, ప్రజలు, వీరిస్థానములు, వీరికిఁ గలపరస్పరాధికారతారతమ్యములు, హక్కు బాధ్యతలు వివరింపఁబడినవి. ఆంగ్లభాషాసంపర్కము లేనివారికిని, భారతచట్టము నామూలాగ్రముగఁ బఠించుట కవకాశము లేనివారికిని, సంక్షేపముగ నేఁటిభారతీయపాలన విధానమందలి మూలసూత్రములఁ దెలిసికొనుట కీగ్రంథ ముపయోగించును. పా.

---

(2) బ్రహ్మవిద్యా. BRAHMAVIDYA (సంపు- 1 సంచి. 2)

అడయారువిద్యాలయసంఘమువారిచేఁ బ్రకటింపఁబడినది. ఇందు మాధవకృత మగుభాష్యముతో ఋగ్వేదము వెనుకటిసంచిక తరువాతి భాగము వెలువడినది. ఉపనిషత్తులకు నాశ్వలాయనగృహ్యసూత్రము

లకు నాంగ్లభాషాంతరీకరణమే కాక నూతనముగ మేళరాగమాలిక యను నపూర్వగ్రంథ మొకటి ప్రారంభింపఁబడినది. ఇది శ్రీ మహావైద్య నాథయ్యరుగారిచే రచియింపఁబడినది. సంగీతశాస్త్రజిజ్ఞాసువుల కత్యంతోపయోగ మనుటలో సందియము లేదు. కర్ణాటదేశమునఁ బ్రచారమునఁ గల డెబ్బదిరెండురాగముల వివరణ మిందుఁ బ్రకటింపఁబడును. టిబెటను భాషనుండి యనువదింపఁబడిన భావసంక్రాంతిసూత్రమూలమును, దాని కాంగ్లభాషాంతరీకరణమును, గలవు. బోధిరుచి, బుద్ధశాంత, ఇట్సింగు మొదలగు సుప్రసిద్ధ బౌద్ధపండితుల మూలగ్రంథములకుఁగలభేదములఁ దెలియఁజేయుటకై యాంగ్లానువాదము లోకచోసీయఁబడినవి.

The Adyar Library Bulletin Vol. I - Part II. This issue contains the continuation of Madhava's Rigveda Bhasya and of the English translation of the Yoga Upanishads commenced in the first part of the Journal. A new work on music called Mela - Ragamalika by Maha Vaidyanatha Iyer is commenced in this issue. The work aims at giving the description of the Seventy two Ragas prevalent in Karnata Music and commences with the Sri-Raga. It is bound to be very useful to lovers of South Indian Music. The Bhava Sankranti Sutra constructed from the Tibetan Version and its translation with the English Versions of the Texts of Bodhiruchi, Buddhasanta and Itsing for Comparative Study are given in this part. We congratulate the Editor and his staff for their useful contribution to Oriental studies in the pages of this Bulletin.

---

(3) కథాసరిత్సాగరము.

వేంకటరామకృష్ణప్రణీతము. 2 వది కథాముఖలంబకము. 4 వది నరవాహనదత్తజననలంబకము. ఈరెండును మాకార్యాలయమునకుఁ జేరినవి. లావాణకలంబకము నిదివఱకే పరిషత్పత్త్రికాపాఠకు లెఱిఁగి యున్నారు. వేదము వేంకటరాయశాస్త్రులుగారి వచన మొక్కటి దీనికి ముందే యున్నది. ఉన్నను దీనిం జదువువారి కిది మృదుమధుర పద్యకావ్య మగుట నెక్కుడుసంతోషము కలిగింపకమానదు.

పూర్వపండితులకు మనకువలె గ్రంథములు లేవు. రామాయణ, భారత, భాగవతాదులే కాని మనకువలె వారి కితరకావ్యము లేవి!

వానిం జదివియే, యశక్తులనైన మనకొఱకు వా రమితము సమూల్యము నైన వివిధకావ్యసంచయమును దయచేసియున్నారు. పైవానితోపాటు పూర్వులు-కథాసరిత్సాగరమునో బృహత్కథనో చదువుకొనుచుండెడువా రనుట కెన్నియో దృష్టాంతముల నీయవచ్చును. ఒక్క కాళిదాసునిం దీసికొందము. అతఁడు రఘువంశము, కుమారసంభవము ననుపేరులు కూడ శ్రీమద్రామాయణమునుండియే గ్రహించెనని చెప్పవచ్చును. మేఘసందేశమును కథాసరిత్సాగరములోని యొక్క శ్లోకమునుబట్టి రచించె నని పెద్దలు చెప్పెదరు. దానిని ముందువిమర్శింతము. అభిజ్ఞానశాకుంతలమును బృహత్కథను జదివియే యాకవి రచియించెను. ఒక్క చోటనున్న దొక్క విషయమును వేఱొక్క చోట నున్నది యొక్కవిషయమును దలలుమార్చి యందందుఁ గూర్చినాఁడు. కథాముఖలంబకములో-తిలోత్తమ శతానీకుని శపియించుట దుర్వాసుఁడు శకుంతలను శపించినట్లు మాఱిచినాఁడు.

ఉ. ఎవ్వతె నీమనంబు హరియించుటఁ జేసి యనన్యబుద్ధివై
యివ్విధి నాకుఁబల్కు గణియింపక నీవిపు డేఁగుచుంటివో
యవ్వనితాలలామ కెడమై పదునాలుగువర్షము లధిక
నెవ్వగ నొంచుచుండెదవు నీవని శాపమొసంగె నయ్యెడన్.

వ. తదీయశాపవచనంబు లింద్రసారథియైన మాతలి యాలించెం గాని, రాజునకట్టి యహితవచనంబు లెఱింగింపనొల్లక మిన్నకుండె.

ప్రథమతరంగము 49-50.

గీ. తండ్రికులముద్ధరింపంగఁ దగినయొక్క
యర్భకుం డున్నవాఁడు నీగర్భమందు
వెలయ నాతండు నీకుద్భవించు నిందు
నవుల భర్తృసమాగమం బడియుఁగలుగు. 1-96

(ఇది జమదగ్ని చెప్పినట్లున్నది) ఉదయనుని జననసందర్భమునఁ గల దానిని కాళిదాసు భరతుని జననమునకు సందర్భించినాఁడు. పైమాటలలో నాఁడువారిమాటలు మగవాఁకిని మగవారి మాట లాఁడువారికినిఁ బెట్టినాఁడు.

గీ. ఇంతలోపల నయ్యాశ్వరేచ్ఛవలన
నుదయనునిచేత బహుమాన మొందినట్టి
చెంచు నప్పుడికడియమ్ముఁ గొంచుఁబోయి
యాపణమ్మున నది యమ్మఁజూపుటయును. 119

ఇక్కడికథ చదువుఁడు. మీకు శాకుంతలనాటకములో నభిజ్ఞాన మెట్లున్నదో విశదమగును. ఒక్కటికాదు:—

౧౨ లంబకము ౨౭ వ తరంగములోఁ జంద్రావలోకుఁ డిందీవరప్రభయను నిరువదియవకథలోని విషయము కొంత శాకుంతలనాటకమునఁ జేర్చినాఁడు.

"అథ సప్రణమ్య రాజా తాం సప్రచ్ఛ సోత్సుకః
భద్రే కః పుణ్యవాన్ వంశ స్త్వత్సఖ్యాలంకృతో యయా
కాని శ్రోత్రామృతస్యన్దీ న్యస్యా నామాక్షరాణి చ
కిం చైవ మనసూ పుష్పసుకుమార మిదం వపుః
తాపసోచితయా వృత్త్యా విజనే స్మిన్ కదర్థ్యతే."

ఈభాగము దుష్యంతునితో ననసూయాప్రియంవదలు సంభాషించుసందర్భమున నడికినాఁడు.

ఇట్టి మెలఁకువలు మనకుఁ దెలియక కాళిదాసుని స్వకల్పనములే యని సంతోషించుచున్నాము. నయమే! ఒకవిద్వాంసుఁడు "దొంగగాని కవియు, వర్తకుఁడును లేఁడు, తనదొంగతనమును గప్పి పుచ్చుకొనువాఁడే గొప్పవాఁ"డను నర్థమిచ్చువిషయము వ్రాసినారు. దానిపరమార్థము నూహింపుఁడు. కొంచెమో గొప్పయో యీకథాసరిత్సాగరముం జది విన సమస్తవిషయములుం దెలిసికొనఁగలరు. ఇట్టియుత్తమగ్రంథమును ముఖ్యముగా మన తెనుఁగువారు పండితులు మొదలందఱు నుపేక్షించుచున్నారు. ఇందు లేనివి మఱియెందును లేవని మఱియొక్కసారిచెప్పుచున్నారము. నరవాహనదత్తజననలంబకము నాగానందకథవలన నెల్లరకు సుపరిచితమైనదే. ఈగ్రంథములలోఁగూడ వెలలు తెల్పఁబడియుండ లేదు.

వ. ఇవ్విధంబున నద్దశరథమహీధవుండు సకలబలసమేతుం డై యంతః
పురకాంతలతోడం గూడం గదలి నదులు వనంబులు నగంబులుం
గడచి కతిపయప్రయాణంబుల నంగరాజరాజధాని డగ్గఱి రోమపా
దుండు ప్రమోదంబున నెదుర్కొని తోడ్కొని పోవం దత్పురంబుఁ
బ్రవేశించి యానృపాలుండు సీయు విడిదియులుపాలు[1] గైకొని
తన్మందిరమ్మునం గొన్నిదివసంబులు విందువిడుల నానందించుచు నంత
నొక్కనాఁ డతనితో ని ట్లనియె. ౧౨

క. ధరణీశతిలక నీకూఁ
తురు శాంతాకన్య భర్తతోఁ గూడఁగ నా
పురికిఁ జనుదెంచి తిరి గిట
కరుదెంచుంగాని వేడ్క నంపఁగవలయున్. ౧౩

చ. అన విని యంగభూవిభుఁడు నట్లయకా కని కూఁతు నల్లుఁ దో
డ్కొని చను మన్న నానృపతికుంజరుఁడు న్ముద మొప్ప వారిఁ దో
డ్కొని చనియెం బురంబునకుఁ గోసలదేశమువారు మార్గసీ
మ నిలిచి కాన్క లిచ్చి కన మన్నన వారల నాదరించుచున్. ౧౪

సీ. చామీకరధ్వజోజ్జ్వలవజ్రసౌధంబు
పల్లవతోరణోద్భాసితంబు
సలిలసంసిక్తశీతలరాజమార్గంబుఁ
సంతతాగరుధూపసౌరభంబుఁ
జిత్రవిశేషభూషితభిత్తిభాగంబుఁ
బ్రతివీథికల్పితోన్నతరథంబు
స్వర్ణరంభాస్తంభసంభృతద్వారంబు
రంగవల్ల్యంకితప్రాంగణంబు
నగుపురంబుఁ బ్రవేశించె నవనివిభుఁడు
ఋశ్యశృంగుని మున్నిడి యిరుగెలఁకుల
బలసమూహంబు మంత్రులు బలసికొలువఁ
బల్లకీలును దాను సంభ్రమము మెఱయ. ౧౫

1. విడిదివిడియులుపాలు-మూ.

క. అప్పుడు పౌరవధూమణు
లుప్పరిగలమీఁద నెక్కి యొక్కట లాజల్
గుప్పించిరి దశరథుపైఁ
గప్పెసఁగెడు తమకుచూపుఁగలువలఁ గూడన్. ౧౬

గీ. అంత నగరు ప్రవేశించి యంతిపురము
నందు నాఋశ్యశృంగుని నగ్రపీఠి
నునిచి యర్ఘ్యంబుఁ బాద్యంబు నొసఁగి వేడ్కఁ
బూజ లొనరించె దశరథభూవరుండు. ౧౭

వ. అప్పుడు. ౧౮

ఉ. అంతిపురంబునం గలుగునంగన లందఱు నెమ్మనంబుల
స్సంతస మొప్ప నేఁడు మన శాంతను గన్గొనఁ గల్గెనంచు న
య్యింతిని వేఱవేఱ తమయిండ్లకుఁ దోడ్కొనిపోయి యెంతయు
స్స్వాంతలుగాఁగ సంతసము వి దు లొనర్చిరి మచ్చిక ల్దగన్. ౧౯

వ. ఋశ్యశృంగుండును దశరథరాజుచేతం బూజ గైకొనుచుం దన్మందిరంబున శాంతయుం దానును సంతసంబునం గొంతకాలంబు సుఖంబున వసియించుచుండ. ౨౦

ఉ. వచ్చె వసంత మంతట నవల్వము మీఱుచు భూరుహావళుల్
హెచ్చఁగ నించువిల్లు వెస నెక్కిడి మారుఁడు పుష్పబాణముల్
గ్రుచ్చఁగ నల్లనల్ల నిలఁ గోయిలమూఁకల మూకభావము
ల్వచ్చఁగ భూజను ల్మిగుల వేడుక లబ్బె నటంచు మెచ్చఁగన్. ౨౧

క. అందంద చిలుకతేజిం
జిందులు ద్రొక్కించికొనుచుఁ జిల్లునఁ దేనె
ల్చిందఁ శరంబులు గైకొని
కందర్పుఁడు గుఱులు వైచెఁ గాననసీమన్. ౨౨

క. కాంతలుఁ బురుషులుఁ గూడి ల
తాంతాక్రాంతంబు లగు వనాంతములందున్
సంతతముఁ జలిపి రెంతయు
సంతస మెసఁగ న్వసంతసమయోత్సవముల్. ౨౩

సీ. కలకంఠకలకలక్రమసమగ్రములైన
జొంపంపుఁగ్రొమ్మావిగుంపులందు
భ్రమరఝంకారసంభ్రమరంజితములైన
గొజ్జంగపొదరిండ్లపజ్జలందు
మధువర్షికుసుమసంపత్సంభృతములైన
వకుళభూరుహముల వాడలందుఁ
బవనధూతపరాగభరితతీరములైన
తెలిదమ్మికొలఁకుల కెలఁకులందు
వేడ్క వనభోజనములు గావించి రపుడు
మావిపండ్లరసంబుతోఁ బూవుఁదేనె
దొప్పలను నించికొనుచు సొం పొప్పుచుండ
నంగనలుఁ దారు జనులు వనాంగణముల. ౨౪

వ. ఇత్తెఱంగున వసంతంబు సకలజనకాంతం బగుచుం గనుపట్టినం జూచి దశరథమహీకాంతుండు సంతసంబున సంతానార్థం బశ్వమేధంబు సేయవలయు నని తలంచి తనయంతఃపురమున సంతతంబును బూజలు గైకొనుచు శాంతాసమేతుం డై యున్న శాంతాకారుఁ గారుణ్యనిధి దేవవర్ణితచరిత్రు దేవవర్ణి ఋశ్యశృంగమునిపుంగవుం జేరంజనుదెంచి నమస్కరించి యి ట్లనియె. ౨౫

— దశరథుఁ డశ్వమేధయాగము చేయుట. —

గీ. ఇదె వసంతంబు వచ్చె నో ఋశ్యశృంగ
మౌనిపుంగవ తామసింపంగవలదు
తురగమేధంబు సేయంగ దొరకొనుందు
సంతతి వొసంగు మీమంత్రశక్తివలన. ౨౬

వ. అనిన ఋశ్యశృంగుం డి ట్లనియె. ౨౭

క. తురగంబు విడువఁ బంపుము
సరయువ హయమేధమునకు సంభారసము
త్కరములు సంపాదింపఁగఁ
బరికించి ప్రధానవరులఁ బనుపు నృపాలా. ౨౮

సీ. అన విని దశరథుం డపుడు సుమంత్రుఁ బి
ల్వఁగఁ బంపి యోమంత్రివర్య నీవు
వైశంబ జాబాలివామదేవసుయజ్ఞ
కాశ్యపప్రముఖు లౌ ఘనుల నాదు
గురువులైన వసిష్ఠవరమౌని వెండియు
వేదాంతవిదుల ఋత్విజుల నెల్లఁ
దోడ్కొని రమ్మన్న వేడ్కతో నతఁడును
జని వారి నందఱ వినయ మెసఁగఁ
బిలిచి తెచ్చిన నమ్మనుకులుఁడు చూచి
మౌనులకు నెల్ల భక్తి నమస్కరించి
డెందమునయందు మోదంబు గందళింపఁ
బలికె నిటని సరసవాక్ప్రౌఢి మెఱయ. ౨౯

చ. వినుఁడు మునీంద్రులార పృథివీపరిపాలనఖేలనంబుచే
ననుపమసౌఖ్యము ల్గలుగునంచు గదా యది యొక్క సౌఖ్యమే
తనయులు లేమి నిప్పు మది దల్లడమొందఁగ సౌఖ్యలేశమున్
గనుఁగొన నైతి సంతతియ కారణ మెన్నఁగ సౌఖ్యపంక్తికిన్. ౩౦

క. తనయులకై హయమేధం
బొనరింపఁగవలయు ననుచు నున్నాఁడను మీ
రనుపమమంత్రవిధిజ్ఞుల
రనుకూలము సేయవలయు నాయజ్ఞంబున్. ౩౧

క. తొలుమేన నిటికరము
చలిపితినో యిపుడు పుత్రసంతానము లే
కలమట నొందెద సంతతి
కలిమికి హయమేధముఖము గావింపఁదగున్. ౩౨

క. ఈఋశ్యశృంగమునివరు
కారుణ్యముచే ఫలించఁ గాంక్షిత మెల్లన్
వారును మీరును సంతతి
కారణముగ నధ్వరంబు గావింపుఁ డొగిన్. ౩౩

చ. అనిన వసిష్ఠమౌనివరుఁ డాదిగఁగల్గినమౌను లందఱున్
మన మలర న్విభండకకుమారుని మున్నిడి సాధుసాధు శో
భనమతి వైనయీనృపతి ప్రశ్నము సేసినరీతి గంటిరే
విన మిల నెందు నీదృశవివేకవిపాకము నెన్నఁ డేనియున్. ౩౪

మ. సుతసంతానము సద్గతిప్రదమటంచుం జాటునానాశ్రుతి
స్మృతిసిద్ధాంత మెఱింగి తత్సుతులకల్మిం గోరి ధర్మక్రమా
ర్జితవిత్తంబున నశ్వమేధమఖముం జేయంగ నూహించె ని
క్షితి సాధుస్తుతి కెల్లయోగ్య మగు నీభాగ్యంబు సామాన్యమే.

క. ఎంతటిధృతి యెంతటిమతి
సంతతిఫల మశ్వమేధసవనమువలనం
గాంతు నని పలికె దృఢముగ
నింతటిరా జెందు నైన నిలలోఁ గలఁడే. ౩౬

చ. అని యిటు లవ్వసిష్ఠముని యాదిగఁగల్గిన మౌను లందఱుం
దనయులు నీకుఁ గల్గెదరు తప్పదు యాగము సేయుమంచుఁ బ
ల్కినపలు కాత్మసమ్మదము గీల్కొనఁ జేయ సమాత్యవర్గముం
గనుఁగొని పల్కె నద్ధరణికాంతుఁడు సంతస మొప్పుచుండఁగన్.

క. నాగురువులయానతిచే
సాగింపుఁడు యాగమఖసంభారంబుల్
వేగ నొనగూడఁ జేయుం
డాగమకోవిదులఁ బిలువనంపుఁ డిచటికిన్. ౩౭

క. ఏమొదల విశృంఖలగతి
నై యవని దిరిగిరాఁగ నశ్వము సోపా
ధ్యాయముగ విడువఁబంపుఁడు
పాయక వెనువెంట సకలబలములు గొలువన్. ౩౮

సీ. సరయూస్రవంతి యుత్తరతటంబునయందు
యజ్ఞభూమి యొనర్పుఁ డచట నచట
శాంతికవిధులు శాస్త్రము దప్పకుండంగ
వర్తిల్లఁ జేయుఁడీ వరమఖంబు

క్షితినాథులకు నెల్లఁ జేయంగ నచ్చుఁ బో
    నొకటి లోపంబు లేకుండవలయుఁ
బగవట్టి విద్వాంసు లగు బ్రహ్మరాక్షసు
    లివ్విఘ్నంబు సేయంగ వేచియుంద్రు
క్రతువునకు విఘ్న మేదైనఁ గలిగెనేని
కర్తకుఁ గీడంత వాటిల్లుఁ గాన మీర
లధ్వరం బెట్లు కొనసాగు నట్లు సేయుఁ
డనిన మంత్రులు నృపుమాట కలరి వేడ్క. ౮౦

క. భూనాథవంశమణి నీ
యానతిఁ దల మోచి యేము హయమేధంబుం
బూని యొనర్తుము తగ నె
ల్లైనను నీతలఁపు సఫల మగు నూహింపన్. ౮౧

వ. మహీపాల భవత్సంకల్పానుసారంబున నశ్వమేధంబునకు వలయు సం
భారంబు లొనగూర్చెద మని పలికిరి వసిష్ఠాదిమౌనీశులు భవ
త్సంకల్పంబు గొనసాగు సర్వంబు సంపన్నం బగు నని యమ్మహీశు
నుపశ్లోకించిరి యమ్మంత్రివరుల ధరణీబృందారకుల నందఱ నంచి
యవితథమనోరథుఁ డగుచు దశరథుండు నంత నశ్వంబు సమంత్రకం
బుగా విడిపించి యంతఃపురంబున కరిగి సుఖం బుండె ననంతరంబ క
ర్మాంతికు లందఱు సంతసంబున. ౮౨

క. శాలలు గట్టిరి చాల వి
శాలతలు చెలంగుచుండ సరయూతటినీ
కూలమున సవనమున కను
కూలముగాఁ బనులనారువు కొమరొప్పంగన్. ౮౩

సీ. సోపానపంక్తులఁ జూపట్టుచుండెను
    సున్నంపుజగతుల సొంపునింపు
మొగసాలలును జుట్టు గగనంబుముట్టెను
    బ్రహరిగోడలు వింతపనుల మెఱయు

శయ్యాగృహములు భోజనకూటములుఁ బాక
శాలలుఁ గొలువుండు చావడులును
స్నానమందిరములు జలజకహ్లారసం
దీప్తంబు లగు కేలిదీర్ఘి కలును
జలువపందిరులును వేడ్క సలుపుచుండ
భూభుజుల కెల్ల నుపకారికాభవనము
లెన్ని యేనియుఁ గట్టి రెల్లెడల మిగులఁ
బలుపు నిడుపును గలుఁగ సంభ్రమము చెలఁగ. ౭౭

క. భూవలయంబునఁ గల నా
నావర్ణంబులకు నెల్ల నవముగ విడుదల్
గావించి రెన్ని యేనియు
నేవంకం గనిన వీథు లేర్పడుచుండన్. ౭౮

చ. నరవరు లంత నధ్వరణినాయకునానతి మోచి వచ్చి ర
ధ్వరవరముం గనుంగొనెడు వాంఛలచే వరదంబులు స్మద
ద్విరదములుం దురంగములు వీరభటౌఘము గొల్వ నుల్లస
ద్విరుదపతాకికానికరదీధితు లంబర మెల్లఁ గప్పఁగన్. ౭౯

సీ. దశరథమేదినీధవుఁ డశ్వమేధంబు
సలుపుచున్నాఁడట యలఘుమహిమ
నతనియజ్ఞంబున నాగంతుకుల కెల్ల
వలసినట్టులు భక్ష్యములు గల వఁట
భోజనంబును గాక భూజనంబున కిత్తు
రఁట రత్నమయభూషణాంశుకములు
నెందటే వచ్చిన నందఱ కచ్చోట
విడుదలు గల వఁట వేడ్క వెలయ
ననుచు నొండొరుఁ జీరుచు నఖలదేశ
వాసులగు బ్రాహ్మణక్షత్ర వైశ్యశూద్ర
వరులు సాకేతపురమున కరుగుదెంచి
రవనినాథుని యధ్వరోత్సవముఁ జూడ. ౮౦

వ. ఇవ్విధంబునం జతురర్ణవీవలయితవసుంధరావలయంబునం గల చతు
ర్వర్ణంబులవార లెల్లం జనుదెంచినం గనుంగొని వసిష్ఠమహర్షి మనం
బున హర్షించుచు దశరథమహీధవునితో ని ట్లనియె. ౭౮

క. భవదీయశాసనంబున
సవనమహోత్సవముఁ జూడ జనకాదిమహీ
ధవు లెల్ల వచ్చి యిదె పుర
సవిధస్థలులందు నిండసాగిరి వేడ్కన్. ౭౯

క. అర్ణవవృతధరణిఁ జతు
ర్వర్ణంబులవార లెల్ల వచ్చిరి క్రతువుం
బూర్ణ మగు నీకు భాగ్యము
వర్ణింపఁగ దరమె యెందు వసుధాధీశా. ౮౦

క. పరిపూర్ణ మయ్యె నంవ
త్సరమును నశ్వంబు వచ్చె ధరణిం దిరిగి భూ
వర సరయూతటమున నిఁకఁ
దురంగమేధంబు సేయ దొరకొనవలయున్. ౮౧

క. రమణులతోడుత సుముహూ
ర్తమునం గ్రతుశాల కరిగి తత్క్రతుదీక్షా
క్రమ మెల్ల నడపు ఋత్వి
క్ప్రముఖుల నియమించు సవనకర్మ మొనర్పన్. ౮౨

సీ. అన విని యట్లకా కని యానృపాగ్రణి
సైద్ధాంతికసమూహసమ్మతి మగు
శోభనదినమున సుముహూర్తవేళ నం
తఃపురకాంతలుఁ దాను నొకట
మణిమయానేకభూషణభూషితాంగులై
చేడియ లుడిగము ల్సేయుచుండ
ఋశ్యశృంగుఁ బురస్కరించి వసిష్ఠప్ర
ముఖభూమిదివిజులు మ్రోలఁ జనఁగ

శంఖదుందుభివాద్యనిస్వనము లెసఁగ
నగరు వెడలి జనంబు లానంద మొంది
తనమహావైభవంబుఁ గన్గొనఁగ నాత్మ
నలరుచును యజ్ఞశాలకు నరిగె నంత. ౫౩

చ. జనపతి యజ్ఞశాలకు ససంభ్రమతన్ రమణీజనంబుతోఁ
జన నపు డభ్రమార్గమున సారెఁ బ్రదక్షిణలీల విష్ణువా
హనములు సుస్వరమ్ముల జయంబులు దెల్పుచు సంచరించెఁ జం
దనగిరిమందగంధపవనం బనుకూలత మించె నంతయున్. ౫౪

గీ. యాగశాలకు నల్లేఁగి యవనివిభుఁడు
దీక్ష గైకొని యంత ఋత్విజులఁ బిలిచి
క్రతువు నడపింపుఁ డనుచుఁ బల్కంగ వారుఁ
జెలఁగి కూశ్మాండగణహోమముల నొనర్చి. ౫౫

వ. ఋశ్యశృంగుఁ బురస్కరించుకొని యశ్వమేధయాగప్రయోగంబు నడ
పం దొడంగి రప్పుడు. ౫౬

ఉ. ఆనరనాథుయాగసదనాంగణభాగమునందు ఋత్విజు
ల్భానురుచుల్ దొలంకు జిగిబంగరుపళ్లెరముల్ గరంబులం
బూని శుభస్వరంబులఁ బ్రమోదము మీఱుచునుండ దేవతా
హ్వాన మొనర్చి రందఱు సురావలియంబరవీథిఁ జూడఁగన్. ౫౭

గీ. ఋశ్యశృంగుండు క్రతువుఁ జేయింపఁ దొడఁగె
నన్నిదిశల నాధ్వర్యవహౌత్రభాగ
తంత్రవిదులైన బ్రాహ్మణోత్తముల నెల్ల
నుండ నియమించి వేడ్క విధ్యుక్తసరణి. ౫౮

క. ఆలోచనామహర్షులు
చాలం దలయూఁచి మెచ్చ సవిధికముగ జి
హ్వాలకృశానువిశాల
జ్వాలల వేలిచిరి మునులు సాన్నాయ్యంబుల్. ౫౯

క. అయ్యాగశాలలోపల
ధాయ్యాసంధుక్షితాగ్నితాపసహుతసా

న్నాయ్యనవసౌరభము సుర
లయ్యారే యనఁగ దిక్కు లలమఁ దొడంగెన్. ౬౦

క. గుమ్మనుచు హవిర్గంధము
గ్రమ్ముచు నలుగడల నిగుడఁగాఁ గర్పురవ
ర్ణమ్మగుచు హోమధూమము
నమ్మఖశాలలను వెడలి యంబర మలమెన్. ౬౧

ఉ. ఆమహిపాలుయజ్ఞసదనాంతరసీమలఁ జూడ నెల్లెడన్
సామగసామగానములు చాలవినం జవియయ్యెఁ గోకిల
స్తోమము పంచమస్వరము సొంపులునింపఁగఁ గ్రోల్చినట్టు లు
ద్దామసుధామధుద్రవము ధారలుగా భువి నిండుకై వడిన్. ౬౨

ఉ. గండయుగస్థలంబుల నఖండమణీఘృణిమండలస్ఫుర
త్కుండలము ల్నటింపఁగ నెదుర్కొని వాద మొనర్చి మాటికిం
బండితకోటి యాధరణిపాలకునధ్వర వాటి నిండి వై
తండికమార్గ వక్రితరతర్క వచఃక్రమము ల్చెలంగఁగన్. ౬౩

క. ప్రతిదివసము నయ్యజ్ఞా
యతనమున భుజించి రప్పు డవనిసురు లవా
రితముగ నిండుచ్ఛాయా
యుత మగు నన్నంబు మద్రసోపేతముగన్. ౬౪

క. గ్రుక్కిళ్లు వెలయ డాచేఁ
బ్రక్కలు నిమురుచును శాకపాకంబుల న
మ్మక్క యటంచుం బొగడుచు
నొక్కట వేడుక భుజించి రుర్వీదివిజుల్. ౬౫

సీ. అయ్యల కిచట గంగామృతంబులు దెండు
వేఁడియన్నములు వేవేగ నిడుఁడు
వడ్డింపుఁ డీబంతి నిడ్డెనకుడుములు
నేయి దొప్పలనిండఁ బోయుఁ డిందుఁ
గూర లన్నియు మాఱు గొంచురం డందఱుఁ
దియ్యచారులు సారె దెండు చాల

మజ్జిగపడిదెము ల్భజ్జను లడుగుండు
కుప్పళింపుఁడు చాయపప్పులెల్లఁ
గ్రుమ్మరింపుఁ డిచ్చోటులఁ దిమ్మనంబు
లనెడుపల్కులె యజ్ఞశాలాంతరమునఁ
గూడి వినవచ్చె మంథానకుధరమథిత
జలనిధానవినాదంబుసరణి నపుడు. ౬౬

క. ఘృతగుడపాయసములతో
సతతము భుజియించె మూకజడబధిరాంధ
వ్రతతియుఁ బంగుగ్లాని
వ్రతిభిక్షుశ్రమణనాథవన్నివహంబుల్. ౬౭

ఉ. గంతులువైచుచు న్నగుచుఁ గాంచనశోభితరత్నమేఖలా
కాంతులు దిక్కులు న్నిగుడఁగాఁ బరివేషకు లప్పు డచ్చటన్
బంతులరీతి సూపఘృతపాయసపాత్రలఁ బట్టి యాడుచు
న్బంతులవెంట వేడుక లొనర్చిరి చూపఱ కెల్లనెల్లెడన్. ౬౮

సీ. అన్నకూటంబులు నాజ్యకటాహముల్
శర్కరోత్కరములు శాకతతులు
సూపరాసులును నపూపసమూహముల్
పాలకాఁగులు ఫలప్రకరములును
వెన్నదిన్నెలు నాలజున్నుకుప్పలుఁ దేనె
బిందెలు మీఁగడపెరుఁగుతొట్లుఁ
బరమాన్నపాత్రలుఁ బానకంబులకొప్పె
రలు నీరుమజ్జిగకొలఁకుగములుఁ
దియ్యదెలినీటిబావులుఁ దెప్పలగుచు
వేలసంఖ్యల మించి యవేలగతులఁ
జూపఱుల కద్భుతంబులు చూపె నప్పు
డమ్మహీనాథు యాగశాలాంతరముల. ౬౯

క. శ్రీరాజ్యాహుతుల మహా
హీరములఁ బ్రవర్గ్గలెసఁగె వితతాగ్నిశిఖా

ధోరణి మిన్నులు ముట్టఁగ
సారెకు వేడుకల సకలజనములుఁ జూడన్. ౭౦

సీ. సరిగ చిత్రపుఁగుట్ల సరిలేని ముత్యాల
బవిరిచౌకట్టులు[1] ఖరిఁధవిల్లఁ
గుఱుచగేదంగిఱేకుల యల్లికల మించు
జడలు పిఱుఁదుల బెడఁగు చూప
జిగిపైఁడియంచులవగల చందురకావి
నెఱికకాసెల నిగనిగలు నిగుడ
నభినయంబుల నేర్పు లలరించుకంకణ
కలితహస్తముల సింగార మమర
ఘనతరమృదంగధింధిమి ధ్వనులు సెలఁగ
వింతకోపులు మెఱయంగ వేశ్య లపుడు
నాట్య మొనరించి రమ్మహీనాథమౌళి
యాగశాలాంతరద్వారభాగములను. ౭౧

గీ. అంతఁ బ్రాతస్సవనము మాధ్యందినసవ
నముఁ దృతీయసవనమును గ్రమముతోడఁ
జలిపి రా ఋత్విజులు మహాసంయమములును
మంత్రతంత్రవిశేషసామగ్రి మెఱయ. ౭౨

వ. విశ్వకర్మీయతంత్రచాతురీచతురాననకల్పులగుశిల్పులవలన ఋత్విక్ప్రముఖులం బురస్కరించుకొని బైల్వంబు లాఱును, ఖాదిరంబు లాఱును, బిల్వసహితంబు లగు పలాశంబు లాఱును బాహువ్యస్తపరిగ్రహంబు లగు శ్లేష్మాతక దేవదారువులు రెండునుం గా నిరువదియొక్క యూపంబులు శ్లక్ష్ణరూపంబులుగా సప్తాంగసంగతంబు లేకవింశత్యరత్నిప్రమాణసహితంబులు గావించి యొండొంటి కేకవింశతి వసనంబులు పొసంగించి యన్నింటికిం గనకచషాలంబులు గీలించి గం

1. బవరిచక్కట్టులు- మూ.

ధపుష్పాక్షతంబుల నలంకరించి ప్రతిష్ఠించి రయ్యూపంబులు దేదీప్య
మానంబు లగుచు నాకసంబునం బ్రకాశించు సప్తర్షులలోకం బ్రకా
శించుచుండె. ౭౩

శా. ఆఋత్విక్కు లంత నిష్టకలచే నందంబు మీఱం జమ
త్కారం బొప్పఁగ రుక్మపక్షగరుడాకారంబుగాఁ బన్ని యం
దారూఢస్థితిఁ జేసి రగ్నిచయనం బాశ్చర్యచర్య న్మహో
దారప్రక్రియ మంత్రతంత్రవిభవవ్యాపార మేపారఁగన్. ౭౪

సీ. అంత ఋత్విజు లెల్ల నాయాజ్ఞహయమును
శామిత్రమున నిల్పి జలచరాది
పశువుల మున్నూటఁ బాటించి యందుతోఁ
గూడ యూపములందుఁ గూర్చికట్టి
విశసింపకయ వాని విడిచిరి కౌసల్య
తత్తురంగంబుఁ బ్రదక్షిణంబు
గావించి నిశితఖడ్గంబులు మూఁడు గై
కొని విశసించె నెమ్మనము వొదల
హోత యధ్వర్యుఁ డుద్గాతయు ను గడంగి
హయముతోఁ గూర్చి రారాత్రి యధిపుసతుల
ముగ్గురను వారు భక్తిసొంపున హయంబు
నొందఁ బరిచర్యచేయుచు నుండి రంత. ౭౫

క. నిపుణత ద్విజు లయ్యశ్వము
వప డించి సమంత్రకముగ వరవైతసశా
ఖపయి నిడి వేల్చి రుత్కట
కృపీటభవకీలలందుఁ గీల్కొనుచుండన్. ౭౬

క. అప్పుడు వప చిటచిట మను
చప్పుడుఁ బ్రజ కేలు చఱచుచప్పుడు నొగినాం
పొప్పఁగ నేక మగుచుఁ గ
కుప్పటలము నెల్లఁ జాల ఘూర్ణిలఁ జేసెన్. ౭౭

గీ. అంత ఋత్విజులెల్ల నాయజ్ఞహయము
నంగములనెల్ల వేల్చిరి యగ్నియందు
సకలసురసంఘ మెల్లను సంస్తుతింప
నంగహోమంబు సాంగమై యతిశయిల్లె. ౭౮

గీ. కల్పసూత్రోక్తసరణి సంకల్ప మొనర
ధరణినాథుని యశ్వమేధంబునందు
మూఁడు సుత్యాహములు సాంగముగ నొనర్చి
రమరులు నుతింప ఋత్విజుల్ క్రమముతోడ. ౭౯

వ. మఱియు జ్యోతిష్టోమంబు నప్తోర్యామంబు నభిజిత్తు విశ్వజిత్తు ను క్థ్యం బతిరాత్రంబు మొదలగు నుత్తరక్రతువులుం గ్రమప్రాప్తి నొనర్చి రంత. ౮౦

మ. ఘనసాన్నాయ్యవిసారిసౌరభసమాక్రాంతాష్టదిక్సీమ మై
యనఘం బై మఘవన్ముఖామరనుతం బై ఋశ్యశృంగాదిస
న్మునిరాణ్మంత్రవచఃక్రణీత మయి సంపూర్ణ ... సంతుష్టభూ
జనసంఘం బయి సాంగమై మెఱసె నాక్ష్మాపాలుయజ్ఞం బిలన్.

వ. అంత నమ్మహీకాంతుండు బ్రహ్మనిర్మితప్రకారంబున యజ్ఞదక్షిణగాఁ దా నేలు భూమియందు హోతకుఁ దూర్పుదిక్కును బ్రహ్మకు దక్షిణ క్షోణియు నధ్వర్యునకుఁ బశ్చిమాశయు నుద్గాతకు నుత్తరంబు ను దత్తంబు సేసె నాఋత్విజు లందఱు నుల్లంబు లలర నమ్మహీవల్లభుం గనుంగొని యి ట్లనిరి. ౮౨

సీ. జననాథ నీవొసంగినయట్టి దక్షిణ
యక్షీణ మై సాంగ మయ్యెఁ జాల
మాకు నమ్మద మయ్యె మణిసువర్ణము లెవ్వి
యైన నీకుఁగ నిచ్చి యవని యెల్లఁ
దిరుగఁ గైకొనుము మేదిని యేల బ్రాహ్మణుల్
తగుదు రె క్షత్రియోత్తములుగాక
బ్రహ్మ మొదల్గాని బ్రాహ్మణు లర యేలి
రనుమాట యెందైన వినుట గలదె

యరయఁ గప్పలమాట బ్రాహ్మణగణంబు
గూడియుడంగనేర దీక్షోణిభరము
దాల్ప శక్తులె నీవ యుద్ధరణి యెల్లఁ
జేకొనుము బ్రహ్మలంగ దక్షిణ యొసంగి. ౮౩

గీ. ఉగ్రశాసనుఁ డగుక్షత్రియోత్తముండు
శిష్టరక్షణమును దుష్టశిక్షణంబుఁ
జేయుచును భూమి యేలినఁ జెల్లుఁగాక
బ్రాహ్మణులు శక్తులే మహిభరము దాల్ప. ౮౪

వ. అనిన విని యట్లకా కని యమ్మహీవల్లభుం డాఋత్విజులకెల్ల మనః
ప్రశ్యయంబు చెలంగ భూమికిం బ్రత్యామ్నాయంబుగా దశలక్ష
ధేనువులు దశకోటిసువర్ణంబులు సువర్ణచతుర్గుణరజతంబులు నొ
సంగె వార లవి యెల్లం గైకొని ఋశ్యశృంగవసిష్ఠమునిపుంగవుల ముం
గలనిడి యందఱు యథోచితంబుగా విభజించి పుచ్చికొని రంత. ౮౫

క. అసమానయశోధనుఁ డా
వసుధావిభుఁ డఖిలదేశవాసులు మెచ్చన్
వసుమణిసందోహంబులు
ప్రసర్పకబ్రాహ్మణులకు భక్తి నొసంగెన్. ౮౬

ఉ. వారిజబాంధవాన్వయుఁ డవారితదానఘనుండు సద్గుణా
ధారుఁడు ధీరుఁ డాదశరథక్షితినాథుఁడు యాగదీక్షచేఁ
గోరికవచ్చినట్టి జనకోటులకెల్లను జాలునట్టుగా
భూరిమహార్ఘ్యరత్నములు భూరిగ నిచ్చె ముదంబు హెచ్చఁగన్. ౮౭

క. అవనీవిభుఁ డయ్యెడ నొక
యవనీదివిజుండు చేరి యడిగినయంతన్
నవరత్నహస్తకటకం
బవిశంకత నొసఁగె జనము లచ్చెరు వందన్. ౮౮

క. ఇప్పగిదిన్ ధనకోటులు
తెప్పలుగా నొసఁగి భూమిదివిజులకు ముదం

బొప్పి నొనర్చెఁ బ్రణామం
బప్పుడు సాష్టాంగముగ జనావళి వొగడన్. ౯౯

వ. ఇట్లు నమస్కరించినం గనుంగొని యందఱు హర్షంబున. ౯౦

శా. ఆయుష్మాన్ భవ పుత్రవాన్ భవ సమగ్రానందసాంద్రో భవ
శ్రీయుక్తో భవ యంచు భూమిసురు లాశీర్వాదముల్ సేసి ర
త్యాయత్తాంచితధర్మశీలు సుగుణోద్యత్కీర్తిశోభాసము
చ్ఛ్రాయద్యోతితలోకు నాదశరథక్ష్మాపాలచూడామణిన్. ౯౧

క. ఆదశరథుఁ డీవిధమున
మోదము మీఱంగ విప్రముఖ్యులయాశీ
ర్వాదములఁ బొదలి యంతట
వేదనిధిన్ ఋశ్యశృంగు వినయం బెనయన్. ౯౨

వ. కనుంగొని నమస్కరించి యిట్లనియె. ౯౩

గీ. ఋశ్యశృంగమునీంద్ర మహేశసదృశ
మహితచిత్రచరిత్ర నీమహిమవలనఁ
దురగమేధంబు గడతేఱె సరగ నింకఁ
బుత్రకామేష్టి సేయంగఁ బూనవలయు. ౯౪

క. శ్రోత్రియులు నుత్తములు నగు
ధాత్రీసురవరులఁ గూడి తడయక వేడ్కం
బుత్రీయేష్టి యొనర్పుఁడు
పుత్రులు గలుగంగ నాకుఁ బుణ్యచరిత్రా. ౯౫

వ. అనిన విని ఋశ్యశృంగమునిపుంగవుండు నంగీకారంబు సెలంగ నో
ధాత్రీశ యట్లన నీకుం బుత్రులు గలిగెదరు మనమ్మున నమ్ము మథర్వ
శిరఃప్రోక్తంబు లగు మంత్రవిశేషంబులం బుత్రేష్టి గావించెద నని
కడంగి సకలయజ్ఞకర్మపరినిష్ఠితు లగు వసిష్ఠాదిమునిశ్రేష్ఠులం గూర్చు
కొని శుభముహూర్తంబున వివిధవిచ్ఛందకసంఘటనాధురీణనిపుణశి
ల్పివరకల్పిత పరిపక్వేష్టకచితంబునుం గనకమయానేకపట్టాంబరాలం
కృతంబును సౌగంధ్యబంధుస్వచ్ఛకుసుమగుచ్ఛశోభితంబును బహిరం

తరావరణదేవతాధిష్ఠితంబునుం బ్రాజ్యసమిదాజ్యచరుసంభారసంభృతంబు ను ధ్రువోపభృజ్జుహూప్రముఖపాత్రవిస్తారితంబు నగుమండపంబునందుం బూర్వాదిదిగవస్థిత గణేశాష్టదిక్పాలకాది దైవతంబును బ్రాహ్మ్యాదిమాతృకాధిష్ఠితంబు ను హోమవిధానలక్షణలక్షితంబు ను నఖండమేఖలాత్రయమండితంబు ను నగుకుండంబునందు నగ్నిం బ్రతిష్ఠించి దర్భాస్తరణపూర్వకంబుగా నగ్నిముఖంబు గావించి తా నాచార్యుం డై యన్నిదిక్కుల ఋత్విక్కుల సమిద్ధోమంబు సేయ నేమించి చరుహోమంబు సేయు దాన పాలుపడి యాలోచనామహర్షులు చూచి తల యూఁచి మెచ్చం బవిత్రధవిత్రపీజనసంధుక్షితంబై ప్రదక్షిణార్చి యగు నగ్నిహోత్రంబునందు నాథర్వణమంత్రంబుల వేల్వం దొడంగె నాసమయంబున యాగభాగంబులకై గరుడగంధర్వకిన్నరకింపురుషసురగణంబులతోడ నింద్రాగ్నియమ (నిరృతి) వరుణవాయుకుబేరేశానులు వచ్చి యచ్చోట నిలిచిరి మహర్షులుం జనుదెంచి రంత. ౯౬

ఉ. కాంచనగర్భుఁ డాక్రతువు గన్గొను వేడుక నేఁగుదెంచెఁ బ్రో
ష్మించుల నీనుచాండు తనమేని మెఱుంగుఁ తోడఁగూడి డా
లించు పసిండితెక్కె జిగిలీలలు మించుచునుండ నొప్పురా
యంచపటాణి నెక్కి యమరౌఘము గొల్వఁగ సమ్మదంబునన్. ౯౭

వ. ఇట్లు చనుదెంచి యయ్యాగశాలాసమీపంబున ననర్ఘమణిగణోదంచితం బగుకాంచనపీఠంబునం గొలువు గూర్చుండి సిద్ధచారణస్తుతులాకర్ణించుచు నందంద వందనంబులు సేయు మునిబృందంబులం జతుర్ముఖోదితంబు లగు మృదుభాషణంబుల బహూకరించుచు నుండె నా సమయంబున. ౯౮

క. రావణపరిపీడితు లగు
దేవత లందఱును గూడి దీనవదను లై
యావనజాసనునకు నతి
గావించి వినీతి మెఱయఁగాఁ బల్కి రొగిన్.* ౯౯

శా. వాణీమోహన హంసవాహన నమోవాకంబు నీకుం జగ
త్ప్రాణిశ్రేణిలలాటలేఖనకళాపారీణ దండంబు నీ
కేణాంకార్కసహస్రతేజ నతి నీ కీవే కృపాలోకము
న్వీణాపాణిసనందనాదిజనకా నీకుం బ్రణామాంజలుల్. ౧౦౦

క. సరసితివిలయముల ని
సర్గగతి న్నీ వొనర్తు శతధృతిమధుజి
ద్భర్గస్వరూపలీల న
నర్గళమహిమైకవిభవ యంభోజభవా. ౧౦౧

ఉ. రావణనాముఁ డైనయొకరాక్షసుఁ డిప్పుడు పుట్టి సర్వలో
కావలిఁ దాన కావలిగ నంతయు నేలుచు నిర్జరోత్తముల్
సేవకులై తనుం గొలువఁ జేయుచు గర్వము దొట్టియున్నవాఁ
డోవనజాసనా జనుల కుండఁగ రాదు జగంబులోపలన్. ౧౦౨

క. దేవర వర మిచ్చితి రని
యావరమున మీఱి వాఁడు కడు నుద్ధతుఁ డై
దేవరమణులం జెఱ గొని
యేవఱకును[1] లేని బాధ లెసఁగం జేసెన్. ౧౦3

క. ఏయెడఁ జూచిన లోకని
కాయము రావణుని చేతికాల్పులఁ బూర్వ
చ్ఛాయ లెడలి దగ్ధపట
న్యాయంబున నుండఁ దొడఁగె నంభోజభవా. ౧౦౪

క. అని యిట్లు విన్నవించిన
విని యప్పరమేష్ఠి యపుడ వేల్పుల నెల్లం
గనుఁగొని భయపడ నేటికి
వనజాక్షుఁడు హరి జగన్నివాసుఁడు గలుగన్. ౧౦౫

క. వర మిచ్చితి మే మెఱుఁగక
సురరిపునకు వాఁడు జగముఁ జూఁడఁగసాగెన్

1. యేవఱకుని- మూ.

హారి యించుక యిది విన్నను
హరియించు న్యావిగర్వ మనిమిషులారా. ౧౦౬

కం. శ్వేతద్వీపమునకుఁ జని
శ్రీతరుణీపతికి నెఱుక సేయుఁడు వేగం
బీ తెఱఁ గంతయు నప్పుడ
యాతంకము లెల్లఁ బాయు నాహరికరుణన్. ౧౦౭

వ. అనిన విని యట్ల కాక యని యప్పురందర ప్రముఖ బృందారకు లందఱు
నవ్విరించిం బురస్కరించుకొని చని రంతఁ దదనంతరకథావృత్తాంతం
బెట్టి దనిన. ౧౦౮

శా. కళ్యాణాచలధీర సాధితజగత్కళ్యాణ వాత్సల్యసౌ
శీల్యాద్యద్భుతకృన్మహాగుణఖనీ సీతాసతీనేత్రసా
ఫల్యాపాదనమోహనాంగ ఘనశోభా సంభృతౌజ్జ్వల్య కౌ
సల్యానందన చంద్రచందనసుధాచంచద్యశోభాసురా. ౧౦౯

కం. భాస్వత్కులైకభాస్వర
భాస్వగ్రాంచితయశోవిభూషణ దోర్వీ
ర్యస్వవశీకృతలోక ము
నిస్వాంతవిహారగేహ నిహ్నుతమోహా. ౧౧౦

భుజంగప్రయాతము.

శరాసారసంభిన్నసంగ్రామరంగా
శరాసారదోర్వీర్యసత్యప్రతిజ్ఞా
ధరాధార ధారాధరస్పర్ధిమూర్తీ
సురాహారనీహారసుస్నిగ్ధకీర్తీ. ౧౧౧

గద్యము. ఇది శ్రీరామచంద్రసాంద్రకరుణాకటాక్షలబ్ధ సిద్ధసారస్వత విశే
షనిరర్గళ వాగ్వైభవ వా శేమసరససాహిత్యకళాభోజ, సత్యసంభాషిత
ముఖాంభోజ, సకల సామ్రాజ్యధౌరేయ, నిత్యవితీర్ణిధారారాధేయ,
నిరతావారితాన్నసత్రసంతోషిత పంచాశత్సహస్రభూసుర, బహు

వారావర్తిత మహాదాన వైభవావర్తిత కీర్తిభాసుర, నిజనామాంకితాకలంకవస్తుసమగ్ర బహుళాగ్రహారభూషిత చోళధరామండల, నిఖిలభోగవిభవనిర్జితాఖండల, సాధితసముద్రాంతరద్వీపపరనృపాలసంస్తుతప్రతాప, నేపాలభూపాల స్థాపనాచార్య, కర్ణాటరాజపూజనీయ ధౌరంధర్య, రామసేతుశ్రీరంగవిజయరాఘవపుర కుంభఘోణాదిదివ్యస్థలప్రతిష్ఠాపితరామభద్ర, సర్వజనసంభావిత గాంభీర్యముద్రానిర్జితసముద్ర, సదాశ్రితభరణదీక్షాదక్ష, దక్షిణసింహాసనాధ్యక్ష, రాజాధిరాజ సన్నుతాసాధారణశౌర్య, దిగంత ప్రసిద్ధతరౌదార్య, సుజ్ఞానజనక, సంతతసంసేవితజనక, పోషితవిద్వత్కవియూథ, భువనశోభితగుణసనాథ, బలవత్ప్రతిబంధిగృహీతసామంతమహీకాంతవిమోచన శ్లాఘనీయబాహుబల, మూర్తిమాంబాగర్భశుక్తిముక్తాఫల, చినచెవ్వయాచ్యుతనృపాలపుత్ర, సజ్జనస్తోత్రపాత్ర, రూపరేఖావిజితసుమసాయక, సకలధర్మసంధాయక, రఘునాథనాయకప్రణీతం బైన శ్రీమద్రామాయణంబున విబుధజనవినుతవివిధకథా శాఖాప్రకాండం బగు బాలకాండంబునం దృతీయాశ్వాసము.

శ్రీరస్తు.

రఘునాథరామాయణము

చతుర్థాశ్వాసము.

క. శ్రీరఘువంశనృపోత్తమ
నీరనిధినిబద్ధనైకనిపుణఘనబలో
త్సారితరిపుప్రచారణ
చారణసంస్తూయమానశౌర్యాభరణా. ౧

వ. అవధరింపు మాసమయంబున. ౨

చ. సురవరు లెల్ల నేఁగి యట చూచిరి వేడుక సంఘటిల్లఁగా
శరశరదభ్రశుభ్రకరచందనకుందనవప్రభావిభా
సురపరితస్ఫురద్గగనచుంబితరంగఘటీఘటాళిసం
గరకరణోద్యమోద్యదధికధ్వనిబోధి సుధాపయోధిన్. ౩

గీ. ఇంద్రముఖ్య దివౌకసు లెల్ల నపుడు
మంద్రబృంహిత గజశోభమానచటుల
చంద్రమండలపాండుకోజ్జ్వలతరంగ
సాంద్ర మగుపాలసంద్రంబుఁ జక్కఁ జూచి. ౪

వ. తద్వైభవంబునకుం జాలం దలయూఁచి మెచ్చుచు నిందుకుందగుచ్ఛ
స్వరూపం బగు శ్వేతద్వీపంబుం గనుంగొని యుప్పొంగుచు నొం
డొరులతోడ. ౫

— శ్వేతద్వీపవర్ణనము. —

సీ. సింధురాజెదను వైచిన మధ్యహారినీల
శాలి యగావజ్రజాలతాళి యనఁగఁ
బలిభీతి నీటిలోపల నుండుతనయుఁ గ
న్గొనఁగ వచ్చిన మంచుఁగొండ యనఁగ

పాలసంద్రపువెండిపళ్ళెరంబునడుమ
నున్న ముత్తెపుఁజిప్పగిన్నె యనఁగ
దనుజాళిపైఁ బాఱి దండువో నెత్తిన
డాలించుతెల్లగుడార మనఁగఁ
పాంచజన్యంబు శౌరిచేపట్టు గాంచి
మించె నిటు మాకు నితని వహించఁ గలుగు
ఘనయశం బని యచటిశంఖంబు లెల్లఁ
దిన్నగా నిల్చె ననఁ దెల్ల దీవి మెఱసె. ౬

సీ. పాలగ్గలముగాఁగఁ గ్రోలి యొకింతైనఁ
గదలని పాండుమేఘం బనంగ
మున్నీటిపాళెంపుమన్నీఁడు కొలువుండు
మేలైన ముత్యాలమేడ యనఁగ
హరిభీతి లేకుండ నద్రులఁ బాలింప
జలధి పూనిన వజ్రఫలక మనఁగ
రతనంబు లుండునీరధిదంతపేటిపైఁ
జెన్నారు బటువైన శిఖర మనఁగఁ
దనభువన మెల్ల నిండునీవనధి యెంత
నోటిపై నాక్రమించెనో చూతు ననుచుఁ
బైకి నిక్కిన శేషునిఫణిసహస్ర
మండలం బనఁ దెలిదీవి నిండికొనియె. ౭

సీ. తనమామగారైన వననిధిభర్తఁ గ
న్గొనఁగ వచ్చినచుక్కగుం పనంగఁ
దనుఁ జుట్టుకొను నహితతి ఫణిపురిఁ జేర్పఁ
జనుదెంచిన కటీరశైల మనఁగ
శివుని చిచ్చుఱకంటి సెక సోఁక నబ్ధి నా
గళమగ్న మగు వెండిగట్ట నంగఁ

గడలి కళంకపంకక్షాళన మొనర్పఁ
జేరిన కలువలచెలి యనంగ
జలనిధానంబు తనకుఁ గావలసి నాక
నాయకున కీక దాఁప నానాఁటఁ బెఁగి
గుమురుగాఁ బైకి వెడలిన యమరతరుల
పూవుఁగొమ్మలు నాఁ దెల్లదీవి మెఱసె. ౮

గీ. దుగ్ధసాగరకర్దమదిగ్ధ మైన
యాదికమఠంబు బహుకాల మచట నుండి
మందరము మోచినట్టి శ్రమంబు దీఱఁ
దేలెనో పైకి ననఁ దెల్ల దీవి మెఱసె. ౯

క. ఉదధి మథియించు వేళల
నుదయించిన యమృతపూర మొకచో నచటం
బదిలంబుగ నిలిపిరో కో
త్రిదశు లనఁగ కీవిఁ దెల్లదీవి చెలంగెన్. ౧౦

సీ. రమపెండ్లినాఁటిముత్తెములప్రా ల్నిండిన
విధుకాంతమణికాంతవేది యనఁగ
జలవారణముల పోరులు చూచు సలిలభ
ర్తకు నొసర్చిన వెండి తమక మనఁగ
జలశాయి హరినాభి చతురాస్యుఁ గొలువ వ
చ్చిన వాహనమరాళసేన యనఁగ
మున్నీటిరాయని ముంజేతి వజ్రమ
య పుహంవీరుతాయత యనంగఁ
బాలసంద్రంబు ఘనయాచకాళి కెల్లఁ
దొరహత్తుగఁ దనరసపూర మిత్తు
ననుచు నెత్తిన ధవళపట్టాంబరధ్వ
జ బనఁగఁ బాండురాంతరీపంబు వెలయు. ౧౧

సీ. నీరధిరా జల్లునికిఁ బవళింపఁ గా
వించిన దంతంపుమంచ మనఁగ
నిచ్చఁ బెండ్లి యొనర్చు నీరుపాపలపైని
బట్టు తెల్లని యుల్లభం బనంగఁ
బాశినగరిలోని పాత్రలు లాగెత్తు
మేలి వజ్రపులాగుమేడ యనఁగ
మరకతచ్ఛవి మించు హరి యుంచు నిర్మల
స్ఫటికసంఘటితపంజర మనంగఁ
గలశవారిధి ద్రచ్చుటకన్న మున్ను
గొన్ని దినములు శశి లోన నున్నవేళఁ
బొడ వెగయు నంకురితులచేఁ బొడమి పేరి
తిన్నె యగుమంచనఁగఁ దెలిదీవి మెఱయు. ౧౨
సీ. అంబుకేళికి వచ్చి యమునుసనఁ గా లూఁది
కదలనేరని వెలిగారనంగ
యాదోవిభునకుఁ దోయనిధి సేయించిన
(వెలఁది)ముత్తెపుసింహపీఠ మనఁగఁ
బాలు గ్రోలఁగఁ గోరి పాలసంద్రముమీఁద
వ్రాలు పురాణమరాళ మనఁగ
జలధి ద్రవ్వుచు సాగరులు నిల్పిన విఫేన
ధట్ట మైనట్టి పెన్నిట్ట యనఁగ
జనకుఁ డైనట్టి దనుఁ గనుఁగొనఁగఁ జేరఁ
బుత్రవాత్సల్యమున మహాంభోధి తరగ
చేతుల బిగించి కౌఁగిటఁ జేర్పఁ గదల
కున్న శశి యనఁ దెలిదీవి చెన్ను మీఱు. ౧౩
సీ. ప్రతిమానచంద్రనిర్మితి కబ్ధి యుంచిన
కారణద్రవ్యసంఘము బనంగ

జ మొది"వంశస్థ"త-జంబు రేఫయా-జ | U |, త U U |, జ | U |, ర U | U;

ఈతాజము రేఫయు-"నింద్రవంశ"కుఁ-త U U |, త U U |, జ | U |, ర U | U;

"ద్రుతవిలంబిత"-దోఁచు నభారలన్-న | | |, భ U | |, భ U | |, ర U | U;

అగయతిఁ "దోధక[1]"-మయ్యె నజాయల్-న | | |, జ | U |, జ | U |, య | U U; దీనిపేరే తామరసము.

నభజరల్గు వి-నం"ప్రియంవద"-న | | |, భ U | |, జ | U |, ర U | U;

"ప్రమితాక్షర" సజస-పంక్తి సముఁ-స | | U; జ | U |, స | | U, స | | U;

"జలోద్ధతగతిఁ" జ-సంబులు జసల్-జ | U |, స | | U, జ | U |, స | | U;

అందం బౌ మాయాప్రాప్తి-"నవిశ్వదేవిఁ"-మ U U U, మ U U U, య | U U, య | U U;

"చంద్రవర్త్మ"యనఁ-జనుఁ రనభసలన్-ర U | U, న | | |, భ U | |, స | | U;

అగయతులఁ "బ్రహే-యం" బయ్యె నామ్యల్ - న | | |, న | | |, మ U U U, య | U U;

"ప్రముదితవదన"-బ్రబ ల్నారరల్- న | | |, న | | |, ర U | U, ర U | U; దీనిపేరే ప్రభావృత్తము.

"కుసుమవిచిత్రం"-గొఁ జాలు నయనయల్-న | | |, య | U U, న | | |, య | U U;

తయ్తయల్ "మణిమాలా"-ఖ్యఁ మద్యతు లొంచుఁ-త U U |, య | U U, త U U |, య | U U;

తాల్చున్న భాశి"లలితఁ"-తభల్ జరల్-త U U |, భ U | |, జ | U |, ర U | U;

---

1. తోటకమని మూలములోనున్నది. అప్పకవి తోదక మని.

నలి "నవమాలిని"- నజభయల్ విన్-న III, జ IUI, భ UII,
 య IUU;
లాగా"మేఘవి-లసిత"మనవనల్-మ UUU, న III, న III, స IIU;
నజజరలీ"పదమాలి"-నాఁదగున్-న III, జ IUI, జ IUI, ర UIU;
స్వరయతి ననరాల్-"ప్రభాఖ్యం"దగున్-న III, న III, ర UIU,
 ర UIU;
ననభర లమరు-న్మహి"తోజ్జ్వలన్"- న III, న III, భ UII,
 ర UIU.

క. తనరు 'నతిజగతి'వృత్తము
 లెనిమిది వేల్నూటతొంబదిరువురలోఁ లో
 ల్చెను మత్తమయూరాదులు
 వినుమని పండ్రెండుపేర్ల వృత్తములు హరీ. ౮౧

౧౩. మా తౌ మత్యంబుల్ నగు-రు"మత్తమయూరన్". మ UUU,
 త UUI, య IUU, స IIU, గ U;
కన్పట్టున్ మనజర-గల్"ప్రహర్షిణి"న్విన్-మ UUU, న III, జ IUI,
 ర UIU, గ U;
మొనసి నజారగ-ముల్ తగుం"బ్రభాతన్"-న III, జ IUI, జ IUI.
 ర UIU, గ U;
ఆభరసంబుపై భగురు-వౌ"జలదన్-" భ UII, ర UIU, న III,
 భ UII, గ U;
జత "మంజుభాషిణి"స-జసజ గ్లమరున్- స IIU, జ IUI, స IIU,
 జ IUI, గ U;
జభస్జగల్"రుచిర"కె-సంగు వల్లహీ- జ IUI, భ UII, స IIU,
 జ IUI, గ U;
ననతతగలనె-న్నన్"క్షమావృత్త"మున్. న III, న III, త UUI,
 త UUI, గ U; ఇదేచంద్రికావృత్తము; దీనిపేరే ఉపావృత్తమును·

యమల్[1] రాగ ల్గా-ల్గా"చంచరీకావ"ళింపై-య I U U, మ U U U,
ర U I U, ర U I U, గ U;

జత ల్సజ ల్గం బె-సంగు"మత్తహాసినిన్-"[2] జ I U I, త U U I, స I I U,
జ I U I, గ U;

స"సుమంగలిన్" సజస-సల్గురువొంకున్- స I I U, జ I U I, స I I U,
స I I U, గ U;

మాల్గ్రిగల్ వల్గాయున్-"చంచరీకాతతిన్"విన్-మ U U U, మ U U U,
ర U I U, ర U I U, గ U.

క. పదునాల్గవ 'శక్వరి' దగు
విదితములైకల పదాలు వేల్మున్నా ట
న్నిడి నాల్గువృత్తములు, తో
య్యిదవి వసంతతిలకానమేత మనిలజా.

౧౪. కల్గు"న్వసంతతిల-కన్"తభజాగగంబులన్- త U U I, భ U I I,
జ I U I, జ I U I, గగ U U;
"సింహోద్ధతం"[3] బగుఁ బ్రసిద్ధిగ దీనిపేరే.
"ఉద్ధర్షిణీ"గరిమ-నొప్పు నిదే పఠింపన్.
"శోభావతిన్" గిరులఁ-జూపు విరామ మిల్లే.
మంజూక్తిఁ జెందు "మధు-మాధవినా"ని దెన్నన్.

ఈభజసనల్ గగము-"నిందువద"నాఖ్యన్-భ U I I, జ I U I, స I I U,
న I I I, గగ U U;
ఒప్పు నిదియే "వనమ-యూర"మహీవల్లిన్.

తర్యల్వల్గంబున్ తనసగగ "ల-సంబాధన్"-మ U U U, త U U I,
న I I I, స I I U, గగ U U;

---

1 అప్పకవీయములో, "మారాగ శ్వేర్బి" యని ముందు పగణ ముంచినాఁడు- ఈగ్రంథములో దీనిని 'చంచరీకాతతి' యనిచెప్పినాఁడు.

2. అప్పకవీయములో దీనిని మత్తహంసిని యని-

3. అప్పకవీయములో, సింహోన్నత యని-

వసుయతి నవరల్ స-వం "బహరాజితర్"-న | | |, న | | |, ర U | U, న | U |, వ | U;

రహి నసభనవల్-"ప్రహరణకలితర్"-న | | |, న | | |, భ U | |, న | | |, వ | U;

సామజరాద్యతి భార-సల్వము "సుందరిర్"-భ U | |, భ U | |, ర U | U, స | | U, వ | U;

"నవనందినిర్" సజస-నల్ గగముఁ జెందుర్- స | | U, జ | U |, స | | U, న | | |, గగ U U;

"భూనుతంబు" రనభాగగ-ముల్ కయతుల్గాఁ-ర U | U, న | | |, భ U | |, భ U | |, గగ U U;

"కమలవిలసిత"నె-గడు ననగాగల్- న | | |, న | | |, న | | |, న | | |, గా U U.

౯. 'అతిశక్వరిఁ' బుట్టిన వసు
బుతుమునినేత్రాగ్నులను[1] దక్షైకగణన నై
కృతులను మణిగణనికరాం
చితవృత్తాదులు వెలయుఁ బ్రసిద్ధపటుమణీ. ౮౭

౧౦. మనులఘువులుగము-మహి"శశికళ"యగా- న | | |, న | | |, న | | |, న | | |, స | | U; (పదునాలుగు లఘువులు నొక్క గురువు)
కరియతి నిది "మణి-గణనికర"మగుర్.
రసయతి నిది-"స్రగ"భిధఁ దనరుఁ గృతిర్.

మహి గజయతి మించెర్- "మాలిని" న్నామయాప్తిర్- న | | |, న | | |, మ U U U, య | U U, య | U U;

నజభజరల్ "ప్రభద్రక"మొ-నర్చు దిగ్యతిర్- న | | |, జ | U |, భ U | |, జ | U |, ర U | U;
గిరిచరచంద్ర వి న్నిది "సు-కేసరం"బగుర్.

సజనల్ న-సల్ యతి-శరదిశక "మిలకు"ర్-స | | U, జ | U |, న | | |, న | | |, స | | U;

1. వసుబుతుమునినేత్రాగ్నులు-3౭౭౬౮.